
టమో'రా'...!

టమోటా సాగు చేసిన రైతులకు దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ధరలు రోజురోజుకు దిగజారిపోతుండడంతో రైతన్నలు దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. పంట సాగుకు చేసిన లక్షలాది రూపాయల అప్పులను ఎలా తీర్చాలో తెలియక సతమతమవుతున్నారు. టమోటా ధరలు ఎప్పుడు ఆకాశాన్ని అంటుతాయో...? ఎప్పుడు పతనమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వేలాదిమంది రైతులు టమోటా పంటను సాగు చేస్తే అందులో కొందరికి మాత్రమే ధరలున్న సమయంలో దిగుబడి వచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ధరలు పాతాళానికి పడిపోవడంతో టమోటాలను తోటలోనే వదిలేసిన దుస్థితి నెలకొంది.


మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమోటా


మొటుకు క్రాస్ వద్ద టమోటా తోటలోనే వదిలేసిన కాయలు

- పాతాళం వైపు టమోటా ధరల చూపు
- తోటల్లోనే వదిలేసిన కాయలు
- బయటి రాష్ట్రాల్లో దిగుబడి అధికం
- విస్తారంగా టమోటా సాగు
- అన్నదాత కష్టం నేల పాలు

గుర్రంకొండ/మదనపల్లె టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పడమటి ప్రాంతాలైన మదనపల్లె, తంబళ్లపల్లె, రామసముద్రం, ములకలచెరువు, గుర్రంకొండ, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, బి.కొత్తకోట, పీటీఎం, కలకడ, కలికిరి, కురబలకోట మండలాల్లో వేలాది ఎకరాల్లో రైతన్నలు టమోటా పంట సాగు చేశారు. ఎకరం టమోటా పంట సాగు చేయాలంటే రైతుకు రూపాయలు 2.5 లక్షలు ఖర్చు వస్తోంది. టమోటా ధరలు పాతాళం వైపు చూస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో 25 కిలోల టమోటా ధర రూ.70 నుంచి 200 వరకు పలికింది. ఈ లెక్కన కిలో టమోటా ధర రూ. 5 నుంచి 8 వరకు పలికింది.

ఐదు రెట్లు పెరిగిన టమోటా దిగుబడులు

జిల్లాలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలతో పాటు రాయచోటిలోని దేవపట్ల తదితర ప్రాంతాల్లో టమోటా విస్తారంగా సాగు చేస్తున్నారు. సుమారు 17 వేల హెక్టార్లకు పైగా టమోటా సాగవుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ సీజన్ ప్రారంభం కావడంతో వారం రోజులుగా ఒక్కసారిగా టమోటా దిగబడులు ఐదురెట్లు పెరిగాయి. మదనపల్లె టమోటా యార్డుకు వారం రోజుల క్రితం ప్రతిరోజూ కేవలం 100 టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి వచ్చేది. కానీ ఐదు రోజుల నుంచి ఒక్కసారిగా టమోటా దిగుబడులు పెరిగి మదనపల్లె మార్కెట్‌కు నిత్యం 500 టన్నుల టమోటా విక్రయానికి వస్తోంది. మరో పదిరోజులు దాటితే టమోటా దిగుబడి మూడింతలు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని వ్యాపారులు అంటున్నారు.

జూదాన్ని తలపిస్తున్న టమోటా సాగు

టమోటా సాగు రైతుల పాలిట జూదంలా మారింది. మార్కెట్‌లో టమోటా ధరలు ఎప్పుడు ఉంటాయో...ఎప్పుడు పతనమవుతాయో తెలియని పరిస్థితి. దీంతో టమోటా పంట బాగా దిగుబడి వచ్చిన సమయంలో ధరలు లేకపోవడం, ధరలున్న సమయంలో టమోటా పంటకు తెగుళ్లు సోకడం, దిగుబడి సరిగా లేకపోవడం రైతులను పట్టిపీడిస్తోంది. రైతులు టమోటా పంటను ఎప్పుడు సాగు చేయాలో తెలియక అప్పుల ఊబిలో చిక్కుకొంటున్నారు.

బయట రాష్ట్రాల్లో దిగుబడితోనే పతనం

ప్రస్తుతం మార్కెట్ యార్డులో టమోటా ధరలు పతనమవడానికి ముఖ్య కారణం బయట రాష్ట్రాల్లో దిగుబడి అధికంగా ఉండడమే. బయట రాష్ట్రాలైన రాయ్‌పూర్, కోల్‌కతా, మహారాష్ట్రలో టమోటా దిగుబడి అధికంగా ఉంది. ఈ రాష్ట్రాల్లో 25 కిలోల క్రేట్ ధర రూ.వంద లోపే ఉంటంతో ఇక్కడి టమోటాలు ఎగుమతికి ప్రాధాన్యత తగ్గింది. ఈ క్రమంలో టమోటాల ఎగుమతి పూర్తిగా నిలిచిపోవడంతో ధరలు క్షీణించాయి.

జూలై వరకు ఆగాల్సిందేనా...?

టమోటకు మంచి ధరలు పలకాలంటే రైతులు జూలై నెల వరకు ఆగాల్సిందే అని వ్యాపారులు, ట్రేడర్లు అంటున్నారు. ఉత్తర భారతదేశంలో మే నెలాఖరుకు ఎండలు ఎక్కువై అక్కడి టమోటా సాగు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది. ఇదే జరిగితే దక్షిణ భారతదేశంలోని అన్నమయ్య, కోలారు ప్రాంతాలకు చెందిన టమోటాకు ఉత్తర భారతదేశంలో డిమాండ్ ఏర్పడనుంది. అంటే మే నెలాఖరుకు అక్కడ డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో ఇక్కడ టమోట ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. కాగా జూన్, జూలై నెలల్లో అడపా దడపా కురిసే వర్షాలతో టమోటా తోటలు దెబ్బతింటే, టమోట దిగుబడి తగ్గి రేట్లు వస్తాయని రైతులు, వ్యాపారులు అంటున్నారు. అంటే జూన్ నెలాఖరుకు, జూలై నెలలోనే టమోటాకు మంచి ధరలు వస్తాయన్న ఊహల్లో ఉన్నారు. వాతావరణ మార్పులు, పంట సాగుపైనే ఈ ధరలు ఆధారపడి ఉంటాయని మార్కెటింగ్ శాఖాధికారులు అంటున్నారు.


క్రిష్ణాపురం వద్ద పొలంలోనే వదిలేసిన టమోటాలు

టమోటాలు కోయాలో...? లేదో అర్థం కావడం లేదు



వ్యవసాయంపై మక్కువతో ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని ఒకటిన్నర ఎకరంలో టమోటా పంట సాగు చేశా. ఇందుకు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశా. ప్రస్తుతం దిగుబడి మొదలైంది. మార్కెట్‌లో ధరలు చూస్తే కిలో రూ.8 పలుకుతుంది. దీంతో టమోటా తోటలో కాయలను కోయాలో...లేక అలానే తోటలో వదిలేయాలో దిక్కుతోచని పరిస్థితి. పంటను వదిలేస్తే అందరిలో చులకనైపోతా. పంట సాగుకు చేసిన అప్పు ఎలా కట్టాలో అర్థం కానీ పరిస్థితి నెలకొంది.

- గంగాధర్, టమోటా రైతు, గుర్రంకొండ, మండలం.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

పడమటి మండలాల్లో రైతన్నలు టమోటా పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. టమోటా ధరలు నిలకడగా లేని పరిస్థితి. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులేస్తే లాభాలను పొందవచ్చు.

- ప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి ఉద్యాన శాఖాధికారి, వాల్మీకిపురం డివిజన్

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రజల దగ్గర నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామ పంచాయతీకి చెందిన ప్రజలు తమ గ్రామంలో శ్మశాన వాటిక లేదని, శ్మశాన వాటికకు కావాల్సిన అనువైన స్థలాన్ని గ్రామానికి కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కలికిరి మండలం తుమ్మలపేట వడ్డెపల్లెకు చెందిన పసుపులేటి పుష్పలత తనకు వితంతు పింఛన్ ఆగిపోయిందని, దానిని పునరుద్ధరించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. పీలేరు గ్రామ పంచాయతీ పీలేరు గ్రామానికి చెందిన లక్ష్మీపతి తమ వీధిలో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ నిర్మాణం పూర్తి కాలేదని, దీనివల్ల వీధిలో ఉండే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం ప్రదర్శించొద్దు

- అదనపు ఎస్పీ వెంకటాద్రి


ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను అలసత్వం చేయకుండా సకాలంలో విచారించి పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని జిల్లా అదనపు ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

వన్యప్రాణులను కాపాడటంలో మెలకువలు నేర్చుకోవాలి

- ప్రముఖ వన్యజీవన నిపుణుడు డాక్టర్ షెరిన్ లారెన్స్


బ్లో గన్‌ను ఎలా ఉపయోగించాలో అటవీ అధికారులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ షెరిన్ లారెన్స్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు జనావాసాల్లోకి వచ్చి చిక్కుకున్న వన్యప్రాణులను కాపాడటంలో అటవీ శాఖాధికారులు మెలకువలు నేర్చుకోవాలని ప్రముఖ వన్యజీవన నిపుణులు డాక్టర్ షెరిన్ లారెన్స్ తెలిపారు. సోమవారం స్థానిక అటవీశాఖ రేంజర్ కార్యాలయం వద్ద అటవీ ఉద్యోగులకు డార్ట్‌గన్, బ్లోగన్ వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాహార్తి తీర్చుకోవడానికి గ్రామాల వద్దకు వచ్చి బావులు, కుంటల్లో పడి చిక్కుకున్న వన్యప్రాణులను ఏ విధంగా కాపాడాలో వివరించారు. దీంతో పాటు క్రూరమైన వన్యప్రాణులు ప్రమాదంలో చిక్కుకుంటే మానవులకు ఎలాంటి ఆపద రాకుండా సురక్షితమైన మత్తు ఇంజెక్షన్లను వాటి దగ్గరకు వెళ్లకుండా దూరం నుంచి ఆ వన్యప్రాణులకు ఎలా ఎక్కించాలి, ఎంత మోతాదులో మత్తు ఇంజెక్షన్ ఇవ్వాలి, వన్యప్రాణుల శరీరంలో ఏ భాగంలో మత్తు ఇంజెక్షన్ షూట్ చేయాలి తదితర విషయాల గురించి తెలిపారు. దీంతో పాటు నోటితో గ్యాస్ ఊదే బ్లోగన్, డార్ట్ గన్‌లో ఇంజెక్షన్ సిరెంజ్ ఎలా ఎక్కించాలి, వాటిని ఎలా ఉపయోగించాలి తదితర విషయాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జీజే ప్రసాదరావు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల నియామకం


డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి


డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాశ్

కడప/రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తోంది. పార్టీ కోసం అకుంఠిత దీక్షతో పనిచేసిన కేడరుకు పదవులు కట్టబెడుతోంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ బీసీ కార్పొరేషన్ల పదవులతో పాటు మార్కెట్‌యార్డులను భర్తీ చేస్తూ వచ్చింది. తాజాగా ఉమ్మడి జిల్లాలో కీలకమైన డీసీసీబీ చైర్మన్ పదవిని ఎం.సూర్యనారాయణరెడ్డికి కట్టబెట్టగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట పంచాయతీకి చెందిన ఎర్రగుండ్ల జయప్రకాశ్‌ను నియమించారు. డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మంచూరు సూర్యనారాయణరెడ్డి అట్లూరు మండలంలోని వేములూరు వాసి. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. లోకేశ్ పాదయాత్రతో పాటు మొన్న జరిగిన ఎన్నికల్లో తనపాత్ర పోషించారు. బద్వేలు నియోజకవర్గంలో కీలక నేతగా గుర్తింపు పొందారు. కొన్ని సామాజిక కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఇక డీసీఎంఎస్ చైర్మన్‌గా రైల్వేకోడూరుకు చెందిన ఎర్రగుండ్ల జయప్రకాశ్‌ను నియమించారు. ఈయన టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. కాగా.. టీడీపీలో కష్టపడే వారికే పదవులు దక్కుతాయనడానికి డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన మంచూరు సూర్యనారాయణరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్ నియామకాలే నిదర్శనమని పొలిట్‌బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా మే 12న తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలానికి కడప రీజియన్ పరిధి లోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుంచి 11వ తేదీ ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా రాత్రి 9కి తిరువణ్ణామలై చేరుకుంటుందన్నారు. బద్వేలు డిపో నుంచి 11వ తేదీ ఉదయం 9గంటలకు, మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3గంటలకు, ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6గంటలకు, జమ్మలమడుగు డిపో నుంచి సాయంత్రం 6గంటలకు, మరో బస్సు రాత్రి 8 గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 7గంటలకు బస్సులు బయలుదేరి తిరువణ్ణామలై చేరుతాయన్నారు.

కడప డిపో నుంచి అయితే టికెట్ ధర రూ.1,249, రూ.1,044, బద్వేలు నుంచి రూ.1,282, మైదుకూరు నుంచి రూ.1,209, ప్రొద్దుటూరు నుంచి రూ.1,273, పులివెందుల నుంచి రూ.1,242, జమ్మలమడుగు డిపో నుంచి రూ.1,363 చార్జీలని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సీట్లను ముందస్తుగా బుక్ చేసుకోవాలని కోరారు.

ఐఎస్‌వో సర్టిఫికెట్ పోటీలో..
పీలేరు గ్రామ పంచాయతీ
- ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
6

వేసవి సెలవులకు వెళుతూ...

- ఇరువురిని బలిగొన్న లారీ
- అనంతరాజుపేట వద్ద రోడ్డు ప్రమాదం
- ఐదుగురికి గాయాలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సందర్భంగా అత్త, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుదామనుకున్న వారిని లారీ మృత్యుశకటంలా దూసుకువచ్చి వారి ఆనందాన్ని ఆవిరి చేసింది. సోమవారం ఉదయం నందలూరు నుంచి తిరుపతికి ఆటోలో వెళుతున్న వారిని మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని గుండాలేరు బ్రిడ్జికి సమీపంలో లారీ ఢీకొన్న ప్రమాదంలో పఠాన్ జహరాబీ (60), పఠాన్ సుహేల్ ఖాన్ (15)లు అక్కడికక్కడే మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన రహీముల్లా తన అత్త అయిన షాహిదాను తిరుపతికి తీసుకెళ్లడానికి ఆదివారం ఆటోలో తిరుపతి నుంచి నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లె సమీపంలో ఉన్న తోటపాళెం వచ్చాడు. సోమవారం ఉదయం ఉదయాన్నే ఆటోలో ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఏడుగురు తిరుపతికి వెళుతుండగా రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట వద్ద తిరుపతి నుంచి వస్తున్న లారీ మృత్యుశకటంలా అతి వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా పఠాన్ ఫరిహనా, పఠాన్ సుహనాఖాన్, పఠాన్ షాహీదా, పఠాన్ అబ్దుల్లా, షేక్ రహీముల్లాలు గాయపడ్డారు. వీరిని అనంతరాజుపేట ఎంపీటీసీ బండారు మల్లికార్జున, గ్రామస్థుల సహకారంతో రైల్వేకోడూరు ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం తిరుపతికి తరలించారు.

నందలూరు తోటపాళెంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎస్ఐ జి.నవీన్‌బాబు, తన సిబ్బందితో హుటాహుటిన వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులకు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన పఠాన్ జహరాబీ, సుహేల్‌ఖాన్
జహరాబీ (ఫైల్)
సుహేల్‌ఖాన్ (ఫైల్)


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఐఎస్‌వో సర్టిఫికెట్ పోటీలో..

పీలేరు గ్రామ పంచాయతీ



- పైలెట్ పంచాయతీగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో పీలేరుకు రానున్న కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్
- ముమ్మరంగా ఆధునికీకరణ పనులు

పీలేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జవాబు దారీ పాలన అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని, వాటిలో పోటీ తత్వాన్ని పెంపొందించాలని అనేక ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల నిర్వహణ, పరిపాలనకు దేశంలోనే పేరెన్నిక గలిగిన కేరళ రాష్ట్రాన్ని ఆద ర్శంగా తీసుకుంటోంది. పరిపాలన, నిధుల వ్యయం, ప్రజలకు నాణ్యమైన సేవలు, ప్రజల సంతృప్తి స్థాయి లాంటి అనేక అంశాలను అభివృద్ధి చేసి ప్రజల మన్నన చూరగొనాలని చూస్తోంది. అందుకు ఐఎస్‌వో (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డై జేషన్-అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ) సర్టిఫి కెట్ల సాధనను ఆలంబనగా చేసుకుంది. అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని ఆ సంస్థ వారు ఆ సర్టిఫికెట్‌ను అందిస్తారు. ఆ సర్టిఫికెట్ పొందిన సంస్థలకు రాష్ట్ర, కేంద్ర, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. రాష్ట్రంలో ఐఎస్‌వో సర్టి ఫికెట్ సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలను పైలెట్ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసింది. అలా అన్నమయ్య జిల్లాలోని కోడూరు, పీలేరు గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగు ణంగా పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు గడి చిన 20 రోజులుగా ఐఎస్‌వో నిబంధనల మేరకు తమ కార్యాలయాన్ని ఆధునికీకరిస్తున్నారు. ఏళ్లుగా నాటుకుపోయిన పాత పద్ధతులను విడనాడి పంచా యతీ కార్యాలయానికి కార్పొరేట్ తరహా సొబగులు అద్దుతున్నారు.

ఐఎస్‌వో సర్టిఫికేషన్ల ప్రయోజనాలు

- ఐఎస్‌వో ప్రమాణాలు ఆయా సంస్థల నాణ్యతా నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో సహా యపడతాయి.
- ఐఎస్‌వో ధ్రువీకరణలు ఆయా సంస్థల పనితీ రును మెరుగుపరుస్తాయి. అవి సమర్థవంతంగా పనిచేసేలా చేస్తాయి.
- ఐఎస్‌వో ధ్రువీకరణలు ఆయా సంస్థల విశ్వసనీ యత, వాటిపై ప్రజల నమ్మకాన్ని మెరుగుపరు స్తాయి.
- ఐఎస్‌వో ధ్రువీకరణలు పొందిన స్థానిక సంస్థ లకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అదనపు నిధులు కేటాయించి వాటిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాయి.

సలహాదారుగా కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా)

ఐఎస్‌వో సర్టిఫికేషన్ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం తన కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్(కి లా)ను నియమించుకుంది. కిలా ప్రతినిధులు రాష్ట్రంలోని 52 పైలెట్ పంచాయతీలలో పర్యటించి ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధన కోసం ఆయా పంచాయ తీల్లో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులు, కార్యాల యాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందించాల్సిన వివిధ సేవల గురించి గత రెండు నెలలుగా అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిం చారు. ఈ ప్రక్రియను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర పంచా యతీరాజ్ ఓఎస్‌డీ కృష్ణతేజ ప్రత్యేకంగా పర్యవేక్షి స్తుండడంతో 52 పంచాయతీల్లో ఐఎస్‌వో సర్టిఫికేష న్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పీలేరు పంచాయతీలో ఆధునిక సౌకర్యాలు

ఐఎస్‌వో సర్టిఫికేషన్ యత్నంలో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్పొరేట్ తరహా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం వెయి టింగ్ రూము, హెల్ప్ డెస్క్, వివిధ సేవల సిటిజన్ చార్టర్, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, మరుగు దొడ్లు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక గదులు, రికా ర్డుల ఆన్‌లైన్ నిర్వహణ, నిర్దేశిత సమయంలో సేవలు అందించే విధానం, కార్యాలయంలో ఆహ్లాద కర వాతావరణం ఉండేలా మొక్కల పెంపకం వంటివి చకాచకా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధన

- గురుమోహన్, ఈవో, పీలేరు పంచాయతీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆలోచనలను అనుగు ణంగా ఐఎస్‌వో సర్టిఫికేషన్ సాధించేందుకు ప్రతిష్టాత్మకంగా పనులు చేస్తున్నాం. ఒకసారి ఆ సర్టిఫికెట్ సాధిస్తే పీలేరు పంచాయతీ రూపురేఖలు మారిపోతాయి. ప్రజలకు నాణ్య మైన సేవలు లభిస్తాయి. పైలెట్ పంచాయతీగా ఎంపికైన నాటి నుంచి పనులను ఎంతో వేగంగా పూర్తి చేస్తున్నాం. త్వరలో రానున్న కిలా బృంద సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుని తప్ప కుండా సర్టిఫికెట్ సాధిస్తాం.

త్వరలో కిలా బృందం రాక

ఐఎస్‌వో సర్టిఫికేషన్ కోసం జరుగుతున్న పనులను పర్యవేక్షించి లోటుపాట్లు తెలియజేసేందుకు పీలే రుకు త్వరలోనే కిలా బృందం రానుంది. వారు సూచించిన మార్పులు, చేర్పులు చేసుకున్న తరు వాత ఐఎస్‌వో బృందం పీలేరు గ్రామ పంచాయతీని పరీక్షించి సర్టిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. పీలేరులో జరుగుతున్న పనులను ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్ వలీ సందర్శించి పలు సూచనలు చేశారు.



కొత్తగా సిద్ధం చేసిన నోటీసు బోర్డులు, కుర్చీలు



ప్రజల కోసం సిద్ధం చేస్తున్న వెయిటింగ్ రూము

గడ్డివామిలో మగశిశివు లభ్యం



శిశువును అందుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు

వీరబల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆ తల్లి నవమాసాలు బిడ్డను మోసింది. పురిటినొప్పులు భరించి పండంటి మగ బిడ్డకు జన్మని చ్చింది. అయితే ఆ ముక్కపచ్చలారని పసికందును పుట్టినరోజే ఊరు శివారులోని గడ్డివాములో వదిలేసి వెళ్లిన సంఘటన మండ లంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలం లోని దిగువరాచపల్లి గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడలో అప్పుడే పుట్టిన మగ పసికందును గుర్తు తెలియని వ్యక్తులు ఊరు శివారులోని గంగమ్మ గుడి దగ్గర ఉన్న ఓ గడ్డివాములో వదిలేసి వెళ్లారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామస్తుడు వీరనాగయ్య తమ గడ్డివామి దగ్గరికి వెళ్లి చూడగా మగశిశువు ప్రత్యక్షమయ్యాడు. వెంటనే అతను గ్రామస్తులు తెలియజేసి వెంటనే శిశువుని రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలపడంతో తిరిగి తన గ్రామానికి తీసుకొచ్చారు. ఎవరో ఆ బిడ్డను ఇక్కడ వదిలేసినట్లు గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకొని మగ శిశువును స్వాధీనం చేసుకుని రాయచోటిలోని సఖి కేంద్రానికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



కిషోర్ (ఫైల్‌ఫొటో)

తంబళ్లపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అను మానాస్పద స్థితిలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన తంబళ్లపల్లెలో సోమవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండకు వెళ్లే దారిలో మద్దాతంబావి వంకలో ఉన్న కానుగచెట్టుకు ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందినట్లు గొర్రెల కాపర్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలుపగా ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆదేశాలతో ఏఎస్‌ఐ నజీర్‌బాష ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బయట ప్రాంతం నుంచి ద్విచక్రవాహనంలో వచ్చి ఇక్కడ ఉరివేసుకుని మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతుడి చిరునామా కోసం వాహన నెంబరుతో ఆన్‌లైన్‌లో శోదించగా బి.కొత్తకోట మండలం తాకటం వారిపల్లెకు చెందిన ఓబులేష కుమారుడు కిషోర్(22)గా గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు తంబళ్లపల్లెకు చేరుకున్నారు. కిషోర్ గత గత మూడు రోజులుగా కనిపించలేదని అతని కోసం పలు చోట్ల వెతికామని.. ద్విచక్రవాహనం కూడా వారం రోజుల కిందట కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా, మృతుడి ఎడమచేతిపై కోసు కున్నట్లు గాట్లు ఉండటం, వేలాడుతున్న మృతదేహం కాళ్లకు చెప్పులు అలాగే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఏఎస్‌ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంకపోరంబోకులో అక్రమ నిర్మాణాలు

- ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు



ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికల్లు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని వంకపోరంబోకు స్థలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. అయితే ఆ నిర్మాణాలను గతంలో రెవెన్యూ అధికారులు నిలిపే శారు. కాగా ఆ వంకపోరంబోకు స్థలంలో తిరిగి నిర్మాణాన్ని ప్రారం భిస్తున్నట్లు స్థానిక వీఆర్వోకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని ఆపేయాలని తేల్చి చెప్పారు. వారు వినకపోవడంతో తహసీల్దార్, పోలీసుల సహా యంతో పులికల్లు గ్రామంలో వంకపోరంబోకులో నిర్మిస్తున్న నిర్మా ణాలను పరిశీలించారు. వాటిని వెంటనే ఆపాలని, కూల్చివేస్తామని తహసీల్దార్ తెలిపారు. గ్రామంలో ఎవరైనా ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రెవెన్యూ యంత్రాంగం విఫలం

- బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మణి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైనట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ పందుగోలమణి ఆరోపించారు. ఈ మేరకు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి, చిన్నయ్యలతో కలిసి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వై.కోట పొలం సర్వే నెంబర్ 1155లో దాదాపు 150 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములను భూకబ్జాదారులు, పెత్తందారులు ఆక్రమించి దొంగ ఆన్‌లైన్ చేసుకొని బ్యాంకుల ద్వారా లక్షల రూపాయలు రుణాలు పొందారని, వారిపై తక్షణమే కేసులు పెట్టి పెత్తందారులు స్వాధీ నంలో ఉన్న ప్రభుత్వ, బంజరు భూములను స్వాధీనం చేసుకోవా లని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉన్న కూటమి పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు, భూకబ్జాదారులకు, పెత్తందారు లకు రెవెన్యూ అధికారులు కొమ్ముగాస్తూ రూ.కోట్ల విలువ చేసే భూములను వారికి కట్టబెట్టి లక్షల రూపాయలు దండుకుంటున్నా రని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములు రెవెన్యూ పోలీ సులు స్వాధీనం పరుచుకొని నిరుపేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింత లపూడి నాగమ్మ, జయరామయ్య, మల్లిక, వెంకట్రమణ, కె.వెంకట్ర మణ, కె.రవి, మణి, రమణ, నరసింహారెడ్డి, హరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైల్వేకోడూరు వాసులు

పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాధవరం గ్రామం నివా సంలో ఉన్న సర్పంచ్ జానకిరామయ్య, టీడీపీ నేత రాజారాం అనే ఇరువురు సోమవారం ఉదయం ఘర్షణ పడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. జరిగిన ఘటనపై పోలీసులు ఆ ప్రాంతా నికి వెళ్లి విచారించారు. పెద్దలు సంపాదించిన ఆస్తి గొడవల్లో ఇరువురికి గత కొన్నిరోజులుగా ఆస్తి తగాదాలు జరుగుతూ ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం ఘర్షణ పడ్డారు. జరిగిన ఘటనలో టీడీపీ నేత రాజారాం కారు అద్దాలు ఇంట్లో ఉన్న టీవీని పగులగొట్టారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సర్పంచ్ జానకిరామయ్య కూడా రాజారాంపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇరువురి ఫిర్యాదులు అందుకుని విచారించి సర్పంచ్ జానకిరామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- మిట్స్‌లో ఆకట్టుకున్న హ్యాకథాన్ పోటీలు



హ్యాకథాన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కురబలకోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ హ్యాకథాన్ ఇంపొసిట్స్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో 246 మంది 73 గ్రూపులుగా ఏర్పడి పోటీలలో పాల్గొన్నారు. ప్రధానంగా సాంకేతిక ఆధారిత పరిష్కారాలను రూపొందించడంలో పాల్గొని, నూతన ఆవిష్కరణలను రూపొందించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వ్యాపార ప్రణాళికలు, డిజైనింగ్, కోడింగ్, సామాజిక ఆలోచనలతో కూడిన నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగా పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మనోజ్‌కుమార్ ప్రథమ బహుమతి రూ.25 వేలు, మిట్స్ కళాశాలకు చెందిన తిరిశాంక్ రెండవ బహుమతి రూ.20 వేలు, ఎస్వీ సెట్ కళాశా లకు చెందిన దినేష్‌కుమార్‌రెడ్డి తృతీయ బహుమతి రూ.15వేలు, ఎస్వీసెట్ కళాశాలకు చెందిన శశిధర్‌రెడ్డి నాలుగవ బహుమతి రూ.10వేలు, మిట్స్ కళాశాలకు చెందిన బాలాజీ 5వ బహుమతి రూ.5వేలు బహుమతులను సాధించడంతో పాటుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ అభినందించారు.

అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా

- ఇరువురికి గాయాలు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట సమీపంలో ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్ మూడో గేటు వద్ద సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... కమ్మపాళెం ఎస్సీ కాలనీకి చెందిన ఎం.సుశాంత్, కల్లూరి కల్యాణి కడపలోని కళాశాలకు సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. బెటాలియన్ మూడో గేటు వద్దకు రాగానే బెటాలియన్ నుంచి ఒక విద్యార్థి సైకిల్‌పై బయ టకు వచ్చాడు. అతన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న అరుగును ఢీకొని బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో సుశాంత్ కు రెండు కాళ్లు విరగ్గా, కల్యాణి తలకు గాయాలయ్యాయని, వారిని కడప ప్రైవేటు వైద్యశాలకు తరలించాలని స్థానికులు తెలి యజేశారు. జరిగిన ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం

- పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్ పొందవచ్చని పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమ వారం ఆయన పీలేరు ఎమ్మార్సీ కార్యాల యంలో మాట్లాడుతూ విద్యార్థులు వారి నివాస సమీప ప్రాంతంలో (సీబీఎస్‌ఈ, ఎసీఎల్‌ఈ, ఎబీ, స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న) అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఎవరు అర్హులు...

అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాం గులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీ, మైనార్టీ, అల్పాదాయం కలిగిన ఓసీలు.

అర్హత వయసు...

సీబీఎస్‌ఈ, ఐసీఎల్‌ఈ, ఐబీ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 1, 2018 నుంచి మార్చి 31, 2019 మధ్య జన్మించి ఆరేళ్ల వయసు నిండిన చిన్నారులై ఉండాలి. రాష్ట్ర సిలబస్‌ను అను సరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం జూన్ 1, 2019 నుంచి మే 31, 2020 మధ్య కాలంలో పుట్టి ఐదు సంవత్సరాలు వయసు నిండి ఉండాలి.

ఎవరెవరికి ఎంత శాతం

ఆరు అంచెల నిర్ధారణ ద్వారా ధ్రువీకరించ బడిన విద్యార్థులలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలు (అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ, దివ్యాంగులు) 5 శాతం. షెడ్యూల్ కులాలు 10 శాతం, షెడ్యూల్ తెగలు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు ఉండే పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించారు.

దరఖాస్తు కోసం...

చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్‌కార్డ్, ఓటరు ఐడీ, రేషన్‌కార్డు, భూయాజ మాన్య పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్ట్, విద్యుత్ బిల్లు ఏదైనా ఉంటే సరి పోతుంది. అలాగే పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం ఉండాలి. మే 2 నుంచి 19వ తేది లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అర్హులైన పేద విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

ప్రైవేట్ స్కూళ్లకు దరఖాస్తు గడువు పొడిగింపు

కలికిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొన్ని రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందడం కోసం దరఖాస్తులు పంపుకోవడానికి గడువు పొడిగించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం మేరకు ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లను రిజర్వ్ చేశారు. ఈ వర్గాలకు చెందిన అర్హులైన విద్యా ర్థులకు ఈ 25 శాతం కోటాలో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తారు. మే 2 నుంచి 19వ తేదీలోగా దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 29న మొదటి రౌండు లాటరీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల ఫలితాలను ప్రకటించనున్నారు. జూన్ 8 నాటికి ఆయా పాఠశాలల్లో ప్రవేశా లకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన యాజమాన్యాలు ప్రవేశాలను ఖరారు చేయ నున్నారు. ఆ తరువాత మిగిలిన సీట్ల కోసం రెండో రౌండు లాటరీని జూన్ 11న నిర్వహి స్తారు. వీరికి సంబంధించిన ప్రవేశాలను 18వ తేదీలోగా పాఠశాలల యాజమాన్యాలు నిర్ధా రించాల్సి వుంది. కొత్త షెడ్యూలు మేరకు అర్హు లైన అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోవాలని కలికిరి ఎంఈవో కరీముల్లా సూచించారు.

వేడుకగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్ర కాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంక రించి బ్యాండు మేళా లతో ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరే గింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై నేడు విచారణ

- విచారణ అధికారిగా ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంవీ ప్రభాకర్‌రావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టేందుకు ఐసీడీ ఎస్ పీడీ శ్రీలక్ష్మిని విచారణ అధికారిగా కలెక్టర్ శ్రీధర్ నియమించారు. జమ్మల మడుగు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి, సాల్మన్ మరో ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి నివేదిక సమర్పించడానికి శ్రీలక్ష్మిని నియమించినట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాల యంలోని డీ బ్లాక్‌లో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభాకర్‌రావుపై ఆధారాలతో కూడిన సాక్ష్యాలు నేరుగా తీసుకురావాలని 29వ తేది మంగళవారం ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా అందరినీ విచారి స్తారని తెలిపారు. విచారణలో వాంగ్మూలాలు రికార్డు చేసి నివేదికను కలెక్టర్‌కు అంద జేస్తామన్నారు.

మైనారిటీలకు సబ్సిడీ రుణాలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు సబ్సిడీ రుణాలు మజూరు చేయనున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రుణాలకు దరఖాస్తు చేసుకు నేందుకు మే 25వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీలకు రూ.లక్ష నుంచి రూ.6లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.లక్షల నుంచి రూ.8లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు తెలి పారు. ఎంపికైన వారికి 50శాతం సబ్సిడీ మంజూరు అవుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఈడీ మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

757 పశువులకు నీటితొట్టెలు మంజూరు

కడపరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు జిల్లాకు 757 పశువుల నీటితొట్టెలను ప్రభు త్వం మంజూరు చేసిందని డ్వామా పీడీ శేషా రెడ్డి తెలిపారు. మంజూరైన నీటితొట్టెలను ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా నిర్మి స్తున్నామని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నీటితొట్టెలను పశువులు నడిచే రహ దారి పక్కన నిర్మిస్తున్నామని దాదాపు వాటి నిర్మాణం పూర్తి అవుతోందని తెలిపారు. పశు వుల నీటితొట్టెలలో నీటిని నింపేందుకు స్థానిక గ్రామ పంచాయతి తగిన ఏర్పాట్లు చేపట్టారని పేర్కొన్నారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కేఫ్‌లో అగ్నిప్రమాదం

● విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ● రూ.4లక్షల ఆస్తి నష్టం

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు మద్రాసు రోడ్డులోని హోండా షోరూం ఎదురుగా ఉన్న బీఆర్ కేఫ్‌లో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పాత కాలం పద్ధతి మాదిరి రూముపై తడికెలు వేసి దానిపై బోద కప్పి పెట్టడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. ఆ రూములో ఉన్న ఫర్నీచర్‌తో పాటు ఫ్యాన్లు, కేఫ్‌కు సంబంధించిన సామగ్రి కాలి బూడిద అయింది. కడపకు చెందిన రామచంద్రనాయుడు ఈ కేఫ్ నిర్వహిస్తున్నాడు. అయితే పదిరోజుల క్రితం ఖాళీ చేసి బాడుగకు ఇవ్వాలనుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగి వస్తువులన్నీ కాలిపోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఫైర్ అధికారులు తెలిపారు.

మోటరు, పైపుల కాల్చివేత.. పోలీసులకు ఫిర్యాదు

చెన్నూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గనపల్లెలో అల్లూరు వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి వ్యవసాయ పొలానికి సంబంధించిన మోటరు, పైపులు కాలిపోయాయని, ఎవరైనా కాల్చివేశారా, ఆకతాయి పనో అర్థం కావడం లేదని స్థానిక సీఐ క్రిష్ణారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. పైపులు టీవీసీవీ కావడంతో పూర్తిగా కాలిపోయిందని, అలాగే మోటరు సైతం కాలిపోయిదని, దీంతో రూ.లక్షకు పైగా నష్టం కలిగిందని వాపోయాడు. పైపులు కాలే సమయంలో మోటరుకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన కేబుల్ కూడా పూర్తిగా కాలిపోయిందని ఆయన తెలిపారు. కాగా ఇటీవల చెన్నూరులో స్వామి కంప్యూటర్స్ యజమాని కోడూరు రాజయ్యస్వామికి సంబంధించిన కారు, కొండపేటలో ఓ రైతుకు చెందిన తమలపాకు తోటకు కూడా ఎవరో ఆకతాయిలు అగ్గిపెట్టడంతో కాలిపోయాయి. ఇవి ఆకతాయిలు చేసిన పనా.. లేక ఇంకెవరైనా చేస్తున్నారా అని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 42వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 42వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ తనిఖీ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు, కొండాపురం సీఐ రఫీ, ముద్దనూరు సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటిని జల్లెడ పట్టారు. ప్రజలతో మాట్లాడారు. అలాగే పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా కొత్తవారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ సోదాల్లో సరైనా డాక్యుమెంట్లు లేని 41మోటార్ సైకిళ్లను, ఒక ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన రైతు రఘు (ఫైల్)

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మండలంలోని వెల్లుర్తి గ్రామానికి చెందిన మాతిగాళ్ల రఘు(45) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న 1.50ఎకరాల పొలంలో పంట సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ముగ్గురు కుమార్తెలకు వివాహం చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువై తీర్చే దారి తెలియక తనువు చాలించాడు. తోట వద్దకు వెళ్తున్నానని చెప్పి గంగమ్మ గుడి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎగువచెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండ్రోజుల్లో జరగనున్న బాల్యవివాహాన్ని సోమవారం అడ్డుకున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 100 ద్వారా రాబడిన సమాచారం మేరకు విచారణ చేయగా సదరు వధువు వివాహ వయస్సు పూర్తి కాలేదని తెలుసుకుని ఇరువైపుల పెద్దలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తహశిల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానం : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్నాయని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విరుచుకుపడ్డారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆడవాళ్లకు, మగవాళ్లకు, హిజ్రాలకు ఎవరికి రక్షణ లేదన్నారు. వేటకొడవళ్ల వీరవిహారం చేస్తున్నాయన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, జూదం, బెట్టింగ్‌లు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. నిన్న ఆదివారం పట్టపగలు కర్నూలు జిల్లా ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిప్పగిరి లక్ష్మీనారాయణను టిప్పర్‌తో ఢీకొట్టి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారు. ఏప్రిల్ 22న టీడీపీనేత వీరయ్యచౌదరిని ప్రత్యర్థులు చంపారని, మార్చి 11న ఒక ఎస్‌ఐని ఓ యువకుడు మద్యం మత్తులో జుట్టుపట్టుకొని లాగాడన్నారు. మద్యం మత్తులో తండ్రిని రంపంతో కోసి చంపాడొకడు, ఇంకొకడు భార్య, కూతురిని నరికి చంపాడన్నారు. ఇంకో చోట కళ్లలో కారం చల్లి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారు. ఇలా చెప్పుకొంటూపోతే కొండవీటి చాంతాడు అవుతుందని, నేర చరిత్ర గల ఎమ్మెల్యేలలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప నగర వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్‌లలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. లగేజీలను పరిశీలించారు. వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్ వ్యాపార ప్రాంతాలు కావడంతో ఇక్కడ జనాల రాకపోకలు రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పోలీసులు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.


లగేజీని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

ఏకసంథాగ్రాహి..



● ఒకసారి వింటే చాలు..

● అనర్గళంగా ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను అప్పజెబుతున్న విద్యార్థి

● పేజీ నంబర్ చెబితే పాఠ్యాంశమంతా వివరణ ● చెస్‌లోనూ ప్రతిభ చూపుతున్న బాలుడు

● ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మట్టిలో మాణిక్యం.. వెంకటవినయ్

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ బాలుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సాధారణ విద్యార్థి. తల్లిదండ్రులూ చదువుకోలేదు. కూలినాలి చేసుకొని జీవించే కుటుంబం. కానీ ఆ విద్యార్థి ప్రతిభ తరగతికి మించి ఉంటుంది. సాధారణంగా తరగతిలోని పాఠ్యాంశాల్లో ప్రశ్నకు జవాబులు నేర్చుకుంటారు. కానీ ఆ పాఠ్యాంశాల్లోని ప్రతి అక్షరాన్ని మెదడులో ఉంచుకోలిగిన మేథస్సు ఈ బాలుడిలో ఉంది. పేజీ నెంబర్ చెబితే చాలు అందులో ఉన్న పాఠ్యాంశాన్ని చూడకుండా చెప్పగలిగే ప్రతిభావంతుడు. చదువుతో పాటు ఆటల్లోను తన ప్రతిభ చూపుతున్నాడు. చెస్‌లో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడిపైనే గెలిచే సత్తా సాధించాడు. ఇది వేంపల్లెలోని శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వలసగారి వెంకటవినయ్ ప్రతిభకు తార్కానం. పిట్ట కొంచెం.. కూత ఘనం నానుడికి చక్కగా సరిపోయే రూపం వెంకటవినయ్. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

వయస్సుకు మించిన ప్రతిభ

వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు, గంగాదేవి కుమారుడు వలసగారి వెంకటవినయ్. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తమ్ముడు జగదీష్ మూడో తరగతి చదువుతున్నాడు. తండ్రి బేల్దారి కూలి కాగా తల్లి ల్యాండ్రీ చేసి జీవించే కుటుంబం. వెంకటవినయ్ ప్రతిభను అక్కడ ఉపాధ్యాయుడిగా పనిచేసే రమేష్ గుర్తించారు. మొదట పాఠం చెప్పిన వెంటనే నేర్చుకొని అప్పజెప్పేవాడు. ఆ బాలుడిపై ప్రత్యేక దృష్టిసారించి మరింత లోతుగా బోధన చేయడంతో ఇంగ్లీష్‌లోని 8పాఠ్యాంశాలను, తెలుగులోని 10 పాఠ్యాంశాలను అనర్గళంగా చెప్పగలిగేంత స్థాయికి చేరుకున్నాడు. మిగతా విద్యార్థులందరు అందులోని ప్రశ్నలకు జవాబులు చెబుతుండగా, వెంటకవినయ్ తన వయసుకు మించి ప్రతిభ చూపుతున్నాడు. పుస్తకాల్లోని పేజీ నెంబర్ చెబితే చాలు.. అందులో ఉన్న పాఠ్యాంశాన్ని చూడకుండా చెప్పగలుగుతున్నాడు. ఇక చేతిరాతను అందంగా రాస్తున్నాడు. చదువుతో పాటు ఆటల్లో కూడా చురుగ్గా రాణిస్తున్నాడు. ప్రధానంగా చెస్‌లో అక్కడ పనిచేసే ఉపాధ్యాయులతో పోటీపడి గెలవగలిగే సత్తా తెచ్చుకున్నాడు.

పేదరికం అడ్డుకారాదు

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వలసగారి వెంకటవినయ్ ఎంతో ప్రతిభావంతుడుగా ఉన్నాడు. ఈ ప్రతిభ ఇలాగే కొనసాగాలంటే పైచదువులకు వెళ్లేసరికి ఆర్థికభారం పడుతుంది. అతని కుటుంబం పేద కుటుంబం కాబట్టి దాతలు ముందుకొచ్చి చదువుకునేందుకు చేయూతనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నది ఇక్కడి ఉపాధ్యాయుల ఆకాంక్ష. మట్టిలో మాణిక్యం లాంటి ఈ విద్యార్థికి మంచి భవిష్యత్తు అందాలని ఆకాంక్షిద్దాం.



కలెక్టర్ కావడమే లక్ష్యం..

నాపేరు వలసగారి వెంకటవినయ్. శ్రీరామ్‌నగర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాను. ఉపాధ్యాయుల సహకారంతో పాఠ్యాంశాల్లో ఎక్కడి నుంచైనా చెప్పగలను. భవిష్యత్తులో కలెక్టరై దేశానికి సేవ చేయడమే నా లక్ష్యం.

ప్రత్యేక దృష్టితో బోధన చేశాం..



చెప్పిన పాఠాలు చెప్పినట్లే వెంటనే అప్పజెప్పేవాడు. నాల్గో తరగతి వరకు ఇలా బోధన సాగింది. ఐదో తరగతిలో ప్రత్యేక దృష్టి సారించి విద్యాబుద్ధులు నేర్పించాం. తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలన్నీ చూడకుండా చెప్పగలుగుతున్నాడు. చెస్‌లోనూ రాణిస్తున్నాడు. ఈ విద్యార్థి చదువు ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

- రమేష్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శ్రీరామ్‌నగర్, వేంపల్లె

పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది

● టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, తాను కూడా జిల్లాలోని పాస్టర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పాస్టర్లకు గౌరవవేతనం అందించినందుకు సోమవారం జమ్మలమడుగులో రాష్ట్ర క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు స్వామిదాసు, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం చర్చిలో థ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మంచి పాలన అందించే దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగా పేద వారికి పట్టణాల్లో ఆహారం సమస్య రాకుండా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారని, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారన్నారు. పాస్టర్ల సమస్యలను క్రిస్టియన్‌సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పాస్టర్లకు గౌరవ వేతనం ఏడు నెలలకు రూ.35 వేలు అందించారని క్రిస్టియన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బిర్రు సంతోష్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి పొన్నతోట మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోండి

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్, వాయు నియామకం కోసం యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈవో సాయిగ్రేస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మే 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభావవంతమైన తరగతి గదికి కమ్యూనికేషన్ ప్రధానం

● వైవీయూ వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాషలో చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలతో అధ్యాపకులు తరగతులను ప్రభావవంతంగా నిర్వహించగలరని వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వైవీయూ ఎఫెక్టివ్ క్లాస్ కమ్యూనికేషన్ ఫర్ టీచింగ్ కమ్యూనిటీ అంశంపై అంతర్జాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సబ్జెక్టు, నాలెడ్జి, లోతైన పరిశోధన, జ్ఞానం, ఆంగ్లంలో చక్కటి భావవ్యక్తీకరణ నేటి గురువులకు అవసరమన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫసర్ పుత్తా పద్మ మాట్లాడుతూ ఆంగ్లభాషలో భావవ్యక్తీకరణ విస్తృత అవకాశాలు కలిగిస్తుందన్నారు. ఆచార్య ఎ.రామచంద్రారెడ్డి, సహ ఆచార్యులు డాక్టర్ టి.చంద్రశేఖర్, డాక్టర్ జయంత్ కశ్యప్, ఆచార్య రియాజున్నీసా, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత, డాక్టర్ అనుప్రసన్న, అధ్యాపకులు విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

భావన టౌన్‌షిప్ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి

● ఆర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి రవిశంకర్‌రెడ్డి


మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భావన టౌన్‌షిప్ భూముల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇందులో ప్రభుత్వ భూమి ఉందని, దీని విలువ సుమారు రూ.200 కోట్లకు పైగా ఉంటుందని, వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని చెరపట్టిన నాటి సీకేదిన్నె తహసీల్దారు, ఎస్‌ఐ, వీరికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైసీసీ హయాంలో తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమాలు చేయించిన మాజీ ఎమ్మెల్యే రవిరెడ్డి, ఆయన అనుచరులైన గుమ్మా రాజేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మూలవంక, ఊటుకూరు రింగు రోడ్డు పరిసరప్రాంతాల్లో మరో 400కు పైగా ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, రానున్న రోజుల్లో వాటిపై కూడా పూర్తి ఆధారాలతో మరో సుదీర్ఘ పోరాటానికి ఆర్‌సీపీ సన్నద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, నగర కార్యదర్శి మగ్బూల్‌బాషా, కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రసాద్, సుబ్బరాయుడు, రమేశ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పాలీసెట్

● ఏర్పాట్లు పూర్తి ● పాలీసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జ్యోతి


విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలీసెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పాలీసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. సోమవారం నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న పాలీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇందేరే సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకే పరీక్షకేంద్రం వద్ద ఉండాలన్నారు. కడపతో పాటు ప్రొద్దుటూరు ప్రాంతంలో ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ అయ్యాయని, హాల్‌టికెట్ అందనివారు 29వ తేదీ మధ్యాహ్నంలోగా తమ కళాశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కోఆర్డినేటర్ దామోదరం పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్‌ఎం



కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో తరిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుల వల్ల కానీ, సంబంధిత ఉద్యోగుల వల్ల కానీ ఏదైనా సమస్యలుంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఈనెల 30వ తేదీన డయల్ యువర్ ఆర్‌ఎం కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4.30 నుండి 5.30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సమస్యలపై సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికు లు 9959225848 నెంబరుకు ఫోన్ చేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభమైన వైవీయూ డిగ్రీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 55 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 25892 మంది విద్యార్థులు సోమవారం బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీకాం, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు ప్రారంభమయ్యాయి. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు తనిఖీ చేసి హాల్‌టికెట్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ఈ పరీక్షలు మే 24వ తేదీ వరకు ఉంటాయని, ప్రతి పరీక్ష కేంద్రానికి అబ్జర్వర్లను నియమించాలని, అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయన్నారు.

ఇరువురు బాలుర మిస్సింగ్


మిస్సింగ్ అయిన దర్శన్, లక్ష్మణ్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిని ఇద్దరు బాలురు ఆదివారం రాత్రి నుంచి కనుబడటం లేదని వారి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంబటూరు వెంకట దర్శన్ (16) గవర్నమెంట్ బాయిస్ హైస్కూల్లో పదో వతరగతి చదివాడు. ఇటీవలె వచ్చిన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. ఆదివారం ఉదయం ఇంట్లో వున్న రూ.500 కనపడకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో దర్శన్ తన చిన్నాన్న ఇంటికి వెళ్లి చిన్నాన్న కొడుకు లక్ష్మణ్ (11) తో కలిసి వెళ్లిపోయాడని తెలిపారు. ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో వెతకడం ప్రారంబించామని, ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

'కులగణన చేయమంటే అరెస్టులా?'

రాయచోటిటౌన్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): కులగణన చేయమంటే అక్రమ అరెస్టులు చేపడతారా అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రమణ, సలహాదారు దువ్వూరి నరసింహాచారి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు హబీబుల్లా, కార్యదర్శి తులసీ రామ్, కార్యవర్గ సభ్యులు రవికుమార్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆదివారం విజయవాడలో నిరసన ర్యాలీని అడ్డుకొని బీసీ సంఘం నేతలను అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు.

ప్రారంభమైన భగవద్గీత అవగాహన కార్యక్రమాలు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన భద్రావతి సమేత బావనారాయణ కోదండరామస్వామివారి సంయుక్త ఆలయాల ఆధ్వర్యంలో శ్రీమద్ భగద్గీత అవగాహన కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు అనంతపురం జిల్లా శాంతానంద ఆశ్రమానికి చెందిన గురు సేవానందస్వామి సుబ్బ రామచంద్ర ఉదయం శ్రీమద్ భగవద్గీత అమృత ప్రవచనములు, సాయంత్రం మహావిష్ణు సహస్రనామ పారాయణం వినిపించారు.

నీటి సరఫరాలో అంతరాయం

చిట్వేలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చిట్వేలి గ్రామ పంచాయతీలో సోమవారం సాయంత్రం ఏడు గంటల నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం 11 గంటల వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ చిట్వేలి మారమ్మ ఆలయం సమీపంలో తాగునీటి పైపులైను మరమ్మతుల కారణంగా పంచాయతీకి సంబంధించిన మోటార్లు నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు ముందుగా నీటిని భద్రపరుచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

శ్మశాన వాటిక బోర్డు తొలగింపుపై తహసీల్దారుకు ఫిర్యాదు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని కొత్తబోయనపల్లెకు చెందిన శ్మశాన వాటిక బోర్డును తొలగించడంపై తహసీల్దారు పీర్‌మున్నీకి సోమవారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళ్లపాక రెవెన్యూ సర్వే నంబరు 1082లో శ్మశాన భూమి ఉందన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ స్పందించి భూమిని తమకు ఇప్పించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో శ్మశానవాటిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. బోర్డును తొలగించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని వివరించారు.

విద్యుత్ తీగలను తొలగించండి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మాసాపేట 31వ వార్డు నారాయణ స్వామి వీధిలో జననివాసాల మధ్య ఉన్న విద్యుత్‌లైన్‌ను తొలగించాలని సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మత్రి సుమిత్ర, సీపీఐ పట్టణ నాయకులు హంస్సేన్, బుజ్జమ్మ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై పడకేసిన పారిశుధ్యం

● పట్టించుకోని అధికార యంత్రాంగం



మాధవరం-1 పార్వతీపురం గ్రామంలో ఇరువైపులా డ్రైనేజీ నీరు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రద్దీ ఉండే కడప-చెన్నై జాతీయ రహదారిపై పారిశుధ్యం పడకేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మండలంలోని మాధవరం-1 గ్రామం కడప- చెన్నై జాతీయ రహదారి రోడ్డుకిరువైపులా చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు వేసే చెత్తతో, డ్రైనేజీతో నీటికుంటలా తయారైంది. అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇళ్లల్లోని వ్యర్థ పదార్థాలు బయట వేయడంతో వాటిని ఆవులు తిని మృత్యువాత పడుతున్నాయి. అధికారులు ఎప్పుడో ఒకసారి క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా పర్యటించి వారానికోసారి డ్రైనేజీ పాటించండి నీటి డ్రమ్ములను శుభ్రం ఉంచుకోవాలని మాటలు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు తప్ప క్షేత్ర స్థాయిలో పర్యటించేనాథుడే లేడు. దీంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. సిద్దవటం, దిగువపేట, కడప, బద్వేలి రహదారి పక్కన డ్రైనేజీ నీరు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణం నెలకొని తీవ్ర దుర్గంధం వల్ల కొంతమంది రోగాలబారిన పడి వైద్యశాలలకు కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతేగాకుండా మాచుపల్లె, ఎస్.రాజంపేట, జంగాలపల్లె, ఉప్పరపల్లె గ్రామాల్లో చెత్తాచెదారం రహదారి పక్కనే నెలకొనడంతో దుర్వాసనకు తట్టుకోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని అపరిశుభ్రత, డ్రైనేజీ ప్రాంతాలను గుర్తించి ప్రజలు రోగాలబారిన పడకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కడప -బద్వేల్ ప్రధాన రహదారి పక్కన దిగువపేట శివారులో నిల్వ ఉన్న మురికినీరు, వ్యర్థాలు

అపరిశుభ్రత లేకుండా చూడాలి

కడప - చెన్నై జాతీయ రహదారి సిద్దవటం మండలంలోని మాధవరం గ్రామం హైవేరోడ్డు ఇరువైపులా మురికినీరు నిల్వతో అష్టకష్టాలు పడుతు న్నాం. ఒంటిమిట్ట కోదండరామయ్య భక్తులు వెళ్లే రహదారిన అపరిశుభ్రత ఏర్పడి భక్తులకు, గ్రామ ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు పరిశీలించి పారిశుధ్యం మెరుగు పరచాలి. - రవికుమార్, మాధవరం



బాపట్ల నియోజకవర్గ పరిశీలకుడిగా ముక్కా రూపానందరెడ్డి



బాపట్ల సమావేశంలో మాట్లాడుతున్న ముక్కా

రైల్వేకోడూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గ పరిశీలకుడిగా కుడా చైర్మన్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియమించారు. సోమవారం బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మతో కలిసి అక్కడి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మే 2న అమరావతిలో ప్రధాని మోదీ పర్యటనను పురస్కరించుకొని అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తనను బాపట్ల నియోజకవర్గానికి పరిశీలకుడిగా నియమించారని తెలిపారు. సభ విజయవంతం కోసం తీసుకోవాల్సి విషయాలపై చర్చించామన్నారు. అమరావతి పునర్నిర్మాణం రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా ఉంటుందన్నారు.

కాగా గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ముక్కా రూపానందరెడ్డిని పరిశీలకుడిగా నియమించారు. అక్కడ అభ్యర్థి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేయడంతో విజయం సాధించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

● రాయచోటి డిపో ఎదుట ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు



ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షుడు ఎన్ఎన్‌రావు, రీజనల్ నాయకులు వైఎస్ రాములు, మునికృష్ణ, సీఎస్ రాజు, నరసయ్య పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాయచోటి డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. మొదటిరోజు దీక్షలో ఉద్యోగులు పీఎస్ఎన్‌రాజు, రామాంజులు, బీఆర్‌బీ నాయక్, సీవీ రమణ, బీ ఎస్‌రెడ్డి, మధుసూదన్, వీపీ నాయుడు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్పీవో విచారణ

వీరబల్లి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాటిగుంటపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని అక్కడి గ్రామస్థులు భాస్కర్‌రాజు, దస్తగిరి దుర్గం ఆంజనేయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం డీఎల్పీవో మస్తాన్‌వలి స్థానిక సచివాలయంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన బ్యానర్ల చించివేతపై ఆగ్రహం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జనసేన బ్యానర్లు చించివేతపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన యువ నాయకులు ముత్యాల కిషోర్, అమర్, వరికూటి నాగరాజు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరుతో చలివేంద్రం ఏర్పాటు చేశామని, అక్కడ ఏర్పాటు చేసిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులా లేక ఇతర పార్టీ వ్యక్తులా అనేది తెలియడం లేదన్నారు. పోలీసులు విచారించి వారిని పట్టుకోవాలని కోరారు.

కశ్మీర్‌లో దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

● ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో నిరసన



రాయచోటిలో ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): 'ఉగ్రవాదం నశించాలి.. కశ్మీర్‌లో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యుజే) జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌనిపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టి మానవహారం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకలు హిందువులను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడడం దుర్మార్గమన్నారు. ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. అనంతరం సాయి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రమూకల దాడి అత్యంత హేయమైన చర్య అన్నారు. ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యుజే అన్నమయ్య జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్‌రాజు, ఈశ్వరయ్య, భువనేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మునెయ్య, నాగరాజ తదితర జర్నలిస్టులు, సాయి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై పోరుకు మేము సైతం



రైల్వేకోడూరు: గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై పోరు మేము సైతం అంటూ రైల్వే కోడూరు జర్నలిస్టులు తమ సంఘీభావం తెలిపారు. కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన నరమేధం నిరసనగా పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం దగ్గర కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టులు రాజశేఖర్, రమేష్ బాబు, ఇర్ఫాన్ బాషా, పంద్ర ప్రసాద్, ముక్కరం వేణు, వంకర సుబ్రహ్మణ్యం, సునీల్, పంద్ర నాగేంద్ర, రమణ, శ్రీనివాస్ రాజు, బాలాజీ, పులి వెంకటేష్, రెడ్డయ్య, కిరణ్, వాకచర్ల నరసింహ ప్రసాద్, వల్లి, వెంకటేష్, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): కార్మికులు వీరోచితంగా పోరాడి 8 గంటలు పని దినం సాధించుకున్న రోజు మే 1న జరుపుకునే మేడేను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డీ. భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద అంగన్వాడీ లీడర్లతో కలిసి మేడే బుక్లెట్స్ విడుదల చేశారు. అంగన్వాడీ లీడర్లు సిద్దమ్మ, శ్రావణి, సుమలత, సురేఖ, రాజమ్మ, సుహాషిణి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి, రాయలసీమ నీటి ప్రాజెక్టుల హామీలన్నీ అమరావతి అభివృద్ధిలో కొట్టుకుపోతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకమే మసకబారి పోతోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యదర్శి సభ్యులు కృష్ణప్ప పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు చమర్తికి ఆహ్వానం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల భువనగిరిపల్లెలో నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు గ్రామస్థులు సోమవారం ఆహ్వాన పత్రికను అందించారు. మే నెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, 13న కల్యాణ మహోత్సవానికి రావాలని కోరారు. మాజీ సర్పంచ్ మన్నేరు లక్ష్మీనరసయ్య, మల్లెం సుబ్బయ్య పాల్గొన్నారు.

గంధం మహోత్సవానికి ప్రసాద్‌బాబుకు ఆహ్వానం

రాయచోటిటౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని పెద్దమండెం మండలం కలిచర్ల గ్రామంలో మే నెల 8న జరగనున్న మౌలాకా పహాడ్ గంధం మహోత్సవానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును ఆహ్వానించారు. కమిటీ సభ్యులు సోమవారం పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో ప్రసాద్‌బాబును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

వక్ఫ్ చట్ట సవరణపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి

రాజంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):వక్ఫ్ చట్టంలో మార్పులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తోట కల్యాణ మండపంలో వక్ఫ్ చట్టం 2025 మార్పులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం వక్ఫ్ 1995 ఆస్తుల నిర్వహణలో మార్పులు చేస్తూ వక్ఫ్‌బోర్డు అసాధారణ ఏకపక్ష అధికారాలను కలిగి ఉండేదన్నారు. దీంతో ఈ చట్టం పక్కదారి పడుతోందన్నారు. చట్టంలోని ఆర్టికల్ 40ను తొలగించి సవరించి బోర్డు కఠినమైన అధికారాలకు అడ్డుకట్ట వేశారన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా ముస్లిం పేద కుటుంబాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, చంద్రమౌళి, ఎల్లంపల్లె ప్రశాంత్, షబ్బీర్ అహ్మద్, పరీద్‌బాబు, మస్తాన్‌వల్లీ, అరిగె రాంప్రసాద్, పిండిబోయిన క్రిష్ణయాదవ్, నరేంద్రరాజు, సురేష్‌రాజు, ప్రభావతి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగికి ఘన నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీడీ వెంకటరత్నం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మలిశెట్టి విశ్వనాథ్ (51) గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం సోమవారం నివాళులర్పించారు. అంత్యక్రియలకు ప్రభుత్వం ద్వారా రూ.15 వే లు అందించారు. కాగా విశ్వనాథ్ ఓబులవారిపల్లె మండలం అరవపల్లె సొంత గ్రామం కాగా ఇదే మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ రైల్వేకోడూరు మండలానికి ఇటీవల బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో తిరుపతి ఆసుపత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తండ్రి మలిశెట్టి క్రిష్ణయ్య తెలిపారు. రైల్వేకోడూరు ఎంపీడీవో నా గార్జున, ఏపీవో మృత్యుంజయరావు, ఓబులవారిపల్లె ఎంపీడీవో మల్‌రెడ్డి, ఏపీవో ధనంజయ్య, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

రైల్వేకోడూరు ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడిగా ఓబులేసు



రైల్వేకోడూరు నూతన ఎన్‌జీవో సంఘం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడిగా పొలిచర్ల ఓబులేసు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీ.శ్రీనువాసులు, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా డి.రవీంద్రవర్మ, కోశాధికారిగా ఎస్.ఎం.డి అస్లాం, ఉపాధ్యక్షులుగా ఏ.విజయ్‌కుమార్, కే.సంతోష్‌రెడ్డి, పి. దేవేంద్రరెడ్డి, ఎస్. చంద్రబాబు, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలిగా కే.యశోద, జాయింట్ కార్యదర్శులుగా సీ.అనసూయ, ఎం.సురేష్, ఎం.శరత్‌కుమార్‌రాజు, ఏ.కలూదా, ఎస్. ఉషారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు ప్రకటించారు.

కుట్టుశిక్షణలో నైపుణ్యం పొందాలి

గాలివీడు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మహిళలందరూ కుట్టు శిక్షణలో నైపుణ్యం పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత పేర్కొన్నారు. సోమవారం గాలివీడు మండల కేంద్రంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి సహకారంతో సచివాలయం-2లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలివీడు పట్టణంలో మహిళలకు ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఎంపీడీవో జవహర్‌బాబు, మాజీ సర్పంచ్ మహమ్మద్ రియాజ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, స్థానిక టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, భాస్కర్, శివ, శిక్షకులు కుమారి పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి వినోదం కార్యక్రమం



మాట్లాడుతున్న జయభారత్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల మురళి యూపీ స్కూల్‌లో రాష్ట్ర గ్రంథాలయ సంచాలకుల ఆదేశాల మేరకు వేసవి వినోదం 2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ నెల 6 వరకు నిర్వహించే వేసవి వినోదం 2025 కార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని డ్రాయింగ్ శిక్షణ, కథల పుస్తకాలు చదివించడం, వినోద కార్యక్రమాలు ఉపయోగకరమన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

సుండుపల్లె, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రం మహమ్మదీయ మసీదులో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సుండుపల్లె మండల ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు అంజద్ బాషా, మత గురువు ముజీబ్‌రెహమాన్, జనసేన నాయకురాలు రెడ్డిరాణి, అతావుల్లా, నరసింహ, రమేశ్, అలీ, వెంకటేశ్, సాబ్జాన్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట ఆర్ అండ్ ఆర్-5 భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ జోన్ బూత్‌లెవల్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి సోమవారం రాజంపేట సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట భూ నిర్వాసితులకు పరిహారం అందించాలని, కోదండరామ దేవాలయం నిర్మించాలని కోరారు. డేంజర్‌జోన్ గ్రామాలైన మంగంపేట, కాపుపల్లె, హరిజనవాడ, దళితవాడలకు చెందిన భూ యజమానులు తమ భూములను ఏపీఎండీసీ మంగంపేట అభివృద్ధి కోసం అప్పగించారన్నారు. వారి కోసం 2013లో ఏర్పాటు చేసిన భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ చట్టం అమల్లో జాప్యం జరుగుతోందన్నారు. పనులను వేగవంతం చేయడమే కాకుండా అర్హులైన గ్రామస్థులు తగు ప్రయోజనాలు పొందేలా చూడాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరూ సమస్యలపై సంఘటితంగా పోరాడాలని ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బీ.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు స్థానిక ఎన్‌జీవో హోంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్య వస్తే ఖచ్చితంగా ఉద్యోగులు సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. నూతన ఎన్జీవో సంఘం అధ్యక్షుడు పొలిచర్ల ఓబులేసు, ప్రముఖ ప్రభుత్వం వైద్యులు దేవేంద్రరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌వో సర్టిఫికెట్ పోటీలో..

పీలేరు గ్రామ పంచాయతీ



● పైలెట్ పంచాయతీగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం

● త్వరలో పీలేరుకు రానున్న కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్

● ముమ్మరంగా ఆధునికీకరణ పనులు

పీలేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జవాబుదారీ పాలన అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని, వాటిలో పోటీతత్వాన్ని పెంపొందించాలని అనేక ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల నిర్వహణ, పరిపాలనకు దేశంలోనే పేరెన్నిక గలిగిన కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటోంది. పరిపాలన, నిధుల వ్యయం, ప్రజలకు నాణ్యమైన సేవలు, ప్రజల సంతృప్తి స్థాయి లాంటి అనేక అంశాలను అభివృద్ధి చేసి ప్రజల మన్నన చూరగొనాలని చూస్తోంది. అందుకు ఐఎస్‌వో (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్-అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ) సర్టిఫికెట్ల సాధనను ఆలంబనగా చేసుకుంది. అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని ఆ సంస్థ వారు ఆ సర్టిఫికెట్‌ను అందిస్తారు. ఆ సర్టిఫికెట్ పొందిన సంస్థలకు రాష్ట్ర, కేంద్ర, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. రాష్ట్రంలో ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలను పైలెట్ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసింది. అలా అన్నమయ్య జిల్లాలోని కోడూరు, పీలేరు గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు గడిచిన 20 రోజులుగా ఐఎస్‌వో నిబంధనల మేరకు తమ కార్యాలయాన్ని ఆధునికీకరిస్తున్నారు. ఏళ్లుగా నాటుకుపోయిన పాత పద్ధతులను విడనాడి పంచాయతీ కార్యాలయానికి కార్పొరేట్ తరహా సొబగులు అద్దుతున్నారు.

ఐఎస్‌వో సర్టిఫికేషన్ల ప్రయోజనాలు

● ఐఎస్‌వో ప్రమాణాలు ఆయా సంస్థల నాణ్యతా నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి.

● ఐఎస్‌వో ధ్రువీకరణలు ఆయా సంస్థల పనితీరును మెరుగుపరుస్తాయి. అవి సమర్థవంతంగా పనిచేసేలా చేస్తాయి.

● ఐఎస్‌వో ధ్రువీకరణలు ఆయా సంస్థల విశ్వసనీయత, వాటిపై ప్రజల నమ్మకాన్ని మెరుగుపరుస్తాయి.

● ఐఎస్‌వో ధ్రువీకరణలు పొందిన స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అదనపు నిధులు కేటాయించి వాటిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాయి.

సలహాదారుగా కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా)

ఐఎస్‌వో సర్టిఫికేషన్ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం తన కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్(కిలా)ను నియమించుకుంది. కిలా ప్రతినిధులు రాష్ట్రంలోని 52 పైలెట్ పంచాయతీలలో పర్యటించి ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధన కోసం ఆయా పంచాయతీల్లో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులు, కార్యాలయాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందించాల్సిన వివిధ సేవల గురించి గత రెండు నెలలుగా అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ ప్రక్రియను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఓఎస్‌డీ కృష్ణతేజ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండడంతో 52 పంచాయతీల్లో ఐఎస్‌వో సర్టిఫికేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పీలేరు పంచాయతీలో ఆధునిక సౌకర్యాలు

ఐఎస్‌వో సర్టిఫికేషన్ యత్నంలో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్పొరేట్ తరహా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం వెయిటింగ్ రూము, హెల్ప్ డెస్క్, వివిధ సేవల సిటిజన్ చార్టర్, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక గదులు, రికార్డుల ఆన్‌లైన్ నిర్వహణ, నిర్దేశిత సమయంలో సేవలు అందించే విధానం, కార్యాలయంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా మొక్కల పెంపకం వంటివి చకాచకా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధన

● గురుమోహన్, ఈవో, పీలేరు పంచాయతీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆలోచనలను అనుగుణంగా ఐఎస్‌వో సర్టిఫికేషన్ సాధించేందుకు ప్రతిష్ఠాత్మకంగా పనులు చేస్తున్నాం. ఒకసారి ఆ సర్టిఫికెట్ సాధిస్తే పీలేరు పంచాయతీ రూపురేఖలు మారిపోతాయి. ప్రజలకు నాణ్యమైన సేవలు లభిస్తాయి. పైలెట్ పంచాయతీగా ఎంపికైన నాటి నుంచి పనులను ఎంతో వేగంగా పూర్తి చేస్తున్నాం. త్వరలో రానున్న కిలా బృంద సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుని తప్పకుండా సర్టిఫికెట్ సాధిస్తాం.

త్వరలో కిలా బృందం రాక

ఐఎస్‌వో సర్టిఫికేషన్ కోసం జరుగుతున్న పనులను పర్యవేక్షించి లోటుపాట్లు తెలియజేసేందుకు పీలేరుకు త్వరలోనే కిలా బృందం రానుంది. వారు సూచించిన మార్పులు, చేర్పులు చేసుకున్న తరువాత ఐఎస్‌వో బృందం పీలేరు గ్రామ పంచాయతీని పరీక్షించి సర్టిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. పీలేరులో జరుగుతున్న పనులను ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్ వలీ సందర్శించి పలు సూచనలు చేశారు.



కొత్తగా సిద్ధం చేసిన నోటీసు బోర్డులు, కుర్చీలు



ప్రజల కోసం సిద్ధం చేస్తున్న వెయిటింగ్ రూము

గడ్డివామిలో మగశిశివు లభ్యం



శిశువును అందుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు

వీరబల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆ తల్లి నవమాసాలు బిడ్డను మోసింది. పురిటినొప్పులు భరించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ ముక్కుపచ్చలారని పసికందును పుట్టినరోజే ఊరు శివారులోని గడ్డివాములో వదిలేసి వెళ్లిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలంలోని దిగువరాచపల్లి గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడలో అప్పుడే పుట్టిన మగ పసికందును గుర్తు తెలియని వ్యక్తులు ఊరు శివారులోని గంగమ్మ గుడి దగ్గర ఉన్న ఓ గడ్డివాములో వదిలేసి వెళ్లారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామస్తుడు వీరనాగయ్య తమ గడ్డివామి దగ్గరికి వెళ్లి చూడగా మగశిశువు ప్రత్యక్షమయ్యాడు. వెంటనే అతను గ్రామస్తులు తెలియజేసి వెంటనే శిశువుని రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలపడంతో తిరిగి తన గ్రామానికి తీసుకొచ్చారు. ఎవరో ఆ బిడ్డను ఇక్కడ వదిలేసినట్లు గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకొని మగ శిశువును స్వాధీనం చేసుకుని రాయచోటిలోని సఖి కేంద్రానికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



కిషోర్ (ఫైల్‌ఫొటో)

తంబళ్లపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన తంబళ్లపల్లెలో సోమవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండకు వెళ్లే దారిలో మద్దాతంబావి వంకలో ఉన్న కానుగచెట్టుకు ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందినట్లు గొర్రెల కాపర్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలుపగా ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆదేశాలతో ఏఎస్‌ఐ నజీర్‌బాష ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బయట ప్రాంతం నుంచి ద్విచక్రవాహనంలో వచ్చి ఇక్కడ ఉరివేసుకుని మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతుడి చిరునామా కోసం వాహన నెంబరుతో ఆన్‌లైన్‌లో శోదించగా బి.కొత్తకోట మండలం తాకటం వారిపల్లెకు చెందిన ఓబులేషు కుమారుడు కిషోర్(22)గా గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు తంబళ్లపల్లెకు చేరుకున్నారు. కిషోర్ గత గత మూడు రోజులుగా కనిపించలేదని అతని కోసం పలు చోట్ల వెతికామని.. ద్విచక్రవాహనం కూడా వారం రోజుల కిందట కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా, మృతుడి ఎడమచేతిపై కోసుకున్నట్లు గాట్లు ఉండటం, వేలాడుతున్న మృతదేహం కాళ్లకు చెప్పులు అలాగే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏఎస్‌ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాధవరం గ్రామం నివాసంలో ఉన్న సర్పంచ్ జానకిరామయ్య, టీడీపీ నేత రాజారాం అనే ఇరువురు సోమవారం ఉదయం ఘర్షణ పడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. జరిగిన ఘటనపై పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. పెద్దలు సంపాదించిన ఆస్తి గొడవల్లో ఇరువురికి గత కొన్నిరోజులుగా ఆస్తి తగాదాలు జరుగుతూ ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం ఘర్షణ పడ్డారు. జరిగిన ఘటనలో టీడీపీ నేత రాజారాం కారు అద్దాలు ఇంట్లో ఉన్న టీవీని పగులగొట్టారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సర్పంచ్ జానకిరామయ్య కూడా రాజారాంపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇరువురి ఫిర్యాదులు అందుకుని విచారించి సర్పంచ్ జానకిరామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● మిట్స్‌లో ఆకట్టుకున్న హ్యాకథాన్ పోటీలు



హ్యాకథాన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కురబలకోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ హ్యాకథాన్ ఇంపాసిట్స్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో 246 మంది 73 గ్రూపులుగా ఏర్పడి పోటీలలో పాల్గొన్నారు. ప్రధానంగా సాంకేతిక ఆధారిత పరిష్కారాలను రూపొందించడంలో పాల్గొని, నూతన ఆవిష్కరణలను రూపొందించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వ్యాపార ప్రణాళికలు, డిజైనింగ్, కోడింగ్, సామాజిక ఆలోచనలతో కూడిన నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగా పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మనోజ్‌కుమార్ ప్రథమ బహుమతి రూ.25 వేలు, మిట్స్ కళాశాలకు చెందిన తిరిశాంక్ రెండవ బహుమతి రూ.20 వేలు, ఎస్వీ సెట్ కళాశాలకు చెందిన దినేష్‌కుమార్‌రెడ్డి తృతీయ బహుమతి రూ.15వేలు, ఎస్వీసెట్ కళాశాలకు చెందిన శశిధర్‌రెడ్డి నాలుగవ బహుమతి రూ.10వేలు, మిట్స్ కళాశాలకు చెందిన బాలాజీ 5వ బహుమతి రూ.5వేలు బహుమతులను సాధించడంతో పాటుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ అభినందించారు.

అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా

● ఇరువురికి గాయాలు

సిద్దవటం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట సమీపంలో ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్ మూడో గేటు వద్ద సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... కమ్మపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ఎం.సుశాంత్, కల్లూరి కల్యాణి కడపలోని కళాశాలకు సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. బెటాలియన్ మూడో గేటు వద్దకు రాగానే బెటాలియన్ నుంచి ఒక విద్యార్థి సైకిల్‌పై బయటకు వచ్చాడు. అతన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న అరుగును ఢీకొని బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో సుశాంత్‌కు రెండు కాళ్లు విరగ్గా, కల్యాణి తలకు గాయాలయ్యాయని, వారిని కడప ప్రైవేటు వైద్యశాలకు తరలించాలని స్థానికులు తెలియజేశారు. జరిగిన ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం

● పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్ పొందవచ్చని పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పీలేరు ఎమ్మార్సీ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యార్థులు వారి నివాస సమీప ప్రాంతంలో (సీబీఎస్‌ఈ, ఎసీఎల్‌ఈ, ఎబీ, స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న) అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఎవరు అర్హులు...

అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీ, మైనార్టీ, అల్పాదాయం కలిగిన ఓసీలు.

అర్హత వయసు...

సీబీఎస్‌ఈ, ఐసీఎల్‌ఈ, ఐబీ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 1, 2018 నుంచి మార్చి 31, 2019 మధ్య జన్మించి ఆరేళ్ల వయసు నిండిన చిన్నారులై ఉండాలి. రాష్ట్ర సిలబస్‌ను అను సరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం జూన్ 1, 2019 నుంచి మే 31, 2020 మధ్య కాలంలో పుట్టి ఐదు సంవత్సరాలు వయసు నిండి ఉండాలి.

ఎవరెవరికి ఎంత శాతం

ఆరు అంచెల నిర్ధారణ ద్వారా ధ్రువీకరించబడిన విద్యార్థులలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలు (అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ, దివ్యాంగులు) 5 శాతం. షెడ్యూల్ కులాలు 10 శాతం, షెడ్యూల్ తెగలు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు ఉండే పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించారు.

దరఖాస్తు కోసం...

చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్‌కార్డ్, ఓటరు ఐడీ, రేషన్‌కార్డు, భూయాజమాన్య పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్ట్, విద్యుత్ బిల్లు ఏదైనా ఉంటే సరిపోతుంది. అలాగే పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం ఉండాలి. మే 2 నుంచి 19వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అర్హులైన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

ప్రైవేట్ స్కూళ్లకు దరఖాస్తు గడువు పొడిగింపు

కలికిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొన్ని రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందడం కోసం దరఖాస్తులు పంపుకోవడానికి గడువు పొడిగించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం మేరకు ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లను రిజర్వ్ చేశారు. ఈ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు ఈ 25 శాతం కోటాలో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తారు. మే 2 నుంచి 19వ తేదీలోగా దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 29న మొదటి రౌండు లాటరీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల ఫలితాలను ప్రకటించనున్నారు. జూన్ 8 నాటికి ఆయా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన యాజమాన్యాలు ప్రవేశాలను ఖరారు చేయనున్నారు. ఆ తరువాత మిగిలిన సీట్ల కోసం రెండో రౌండు లాటరీని జూన్ 11న నిర్వహిస్తారు. వీరికి సంబంధించిన ప్రవేశాలను 18వ తేదీలోగా పాఠాశాలల యాజమాన్యాలు నిర్ధారించాల్సి వుంది. కొత్త షెడ్యూలు మేరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోవాలని కలికిరి ఎంఈవో కరీముల్లా సూచించారు.

వేడుకగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై నేడు విచారణ

● విచారణ అధికారిగా ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంవీ ప్రభాకర్‌రావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టేందుకు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీని విచారణ అధికారిగా కలెక్టర్ శ్రీధర్ నియమించారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి, సాల్మన్ మరో ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి నివేదిక సమర్పించడానికి శ్రీలక్ష్మీని నియమించినట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీ బ్లాక్‌లో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభాకర్‌రావుపై ఆధారాలతో కూడిన సాక్ష్యాలు నేరుగా తీసుకురావాలని 29వ తేది మంగళవారం ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా అందరినీ విచారిస్తారని తెలిపారు. విచారణలో వాంగ్మూలాలు రికార్డు చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

మైనారిటీలకు సబ్సిడీ రుణాలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు మే 25వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీలకు రూ.లక్ష నుంచి రూ.6లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.లక్షల నుంచి రూ.8లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 50శాతం సబ్సిడీ మంజూరు అవుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఈడీ మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

757 పశువులకు నీటితొట్టెలు మంజూరు

కడపరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు జిల్లాకు 757 పశువుల నీటితొట్టెలను ప్రభుత్వం మంజూరు చేసిందని డ్వామా పీడీ శేషారెడ్డి తెలిపారు. మంజూరైన నీటితొట్టెలను ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా నిర్మిస్తున్నామని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నీటితొట్టెలను పశువులు నడిచే రహదారి పక్కన నిర్మిస్తున్నామని దాదాపు వాటి నిర్మాణం పూర్తి అవుతోందని తెలిపారు. పశువుల నీటితొట్టెలలో నీటిని నింపేందుకు స్థానిక గ్రామ పంచాయతి తగిన ఏర్పాట్లు చేపట్టారని పేర్కొన్నారు.

వంకపొరంబోకులో అక్రమ నిర్మాణాలు

● ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు



ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికల్లు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని వంకపొరంబోకు స్థలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. అయితే ఆ నిర్మాణాలను గతంలో రెవెన్యూ అధికారులు నిలిపేశారు. కాగా ఆ వంకపొరంబోకు స్థలంలో తిరిగి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు స్థానిక వీఆర్వోకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని ఆపేయాలని తెల్చి చెప్పారు. వారు వినకపోవడంతో తహసీల్దార్, పోలీసుల సహాయంతో పులికల్లు గ్రామంలో వంకపొరంబోకులో నిర్మిస్తున్న నిర్మాణాలను పరిశీలించారు. వాటిని వెంటనే ఆపాలని, కూల్చివేస్తామని తహసీల్దార్ తెలిపారు. గ్రామంలో ఎవరైనా ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రెవెన్యూ యంత్రాంగం విఫలం

● బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మణి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైనట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ పండుగోలమణి ఆరోపించారు. ఈ మేరకు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి, చిన్నయ్యలతో కలిసి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వైకోట పొలం సర్వే నెంబర్ 1155లో దాదాపు 150 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములను భూకబ్జాదారులు, పెత్తందారులు ఆక్రమించి దొంగ ఆన్‌లైన్ చేసుకొని బ్యాంకుల ద్వారా లక్షల రూపాయలు రుణాలు పొందారని, వారిపై తక్షణమే కేసులు పెట్టి పెత్తందారులు స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ, బంజరు భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉన్న కూటమి పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు, భూకబ్జాదారులకు, పెత్తందారులకు రెవెన్యూ అధికారులు కొమ్ముగాస్తూ రూ.కోట్ల విలువ చేసే భూములను వారికి కట్టబెట్టి లక్షల రూపాయలు దండుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములు రెవెన్యూ పోలీసులు స్వాధీనం పరుచుకొని నిరుపేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, జయరామయ్య, మల్లిక, వెంకట్రమణ, కె.వెంకట్రమణ, కె.రవి, మణి, రమణ, నరసింహారెడ్డి, హరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైల్వేకోడూరు వాసులు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కేఫ్‌లో అగ్నిప్రమాదం

● విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ● రూ.4లక్షల ఆస్తి నష్టం

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు మద్రాసు రోడ్డులోని హోండా షోరూం ఎదురుగా ఉన్న బీఆర్ కేఫ్‌లో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పాత కాలం పద్ధతి మాదిరి రూముపై తడికెలు వేసి దానిపై బోద కప్పి పెట్టడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. ఆ రూములో ఉన్న ఫర్నీచర్‌తో పాటు ఫ్యాన్లు, కేఫ్‌కు సంబంధించిన సామగ్రి కాలి బూడిద అయింది. కడపకు చెందిన రామచంద్రనాయుడు ఈ కేఫ్ నిర్వహిస్తున్నాడు. అయితే పదిరోజుల క్రితం ఖాళీ చేసి బాడుగకు ఇవ్వాలనుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగి వస్తువులన్నీ కాలిపోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.4లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఫైర్ అధికారులు తెలిపారు.

మోటర్, పైపుల కాల్చివేత.. పోలీసులకు ఫిర్యాదు

చెన్నూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గనపల్లెలో అల్లూరు వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి వ్యవసాయ పొలానికి సంబంధించిన మోటరు, పైపులు కాలిపోయాయని, ఎవరైనా కాల్చివేశారా, ఆకతాయి పనో అర్థం కావడం లేదని స్థానిక సీఐ క్రిష్ణారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. పైపులు టీవీసీవీ కావడంతో పూర్తిగా కాలిపోయిందని, అలాగే మోటరు సైతం కాలిపోయిదని, దీంతో రూ.లక్షకు పైగా నష్టం కలిగిందని వాపోయాడు. పైపులు కాలే సమయంలో మోటరుకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన కేబుల్ కూడా పూర్తిగా కాలిపోయిందని ఆయన తెలిపారు. కాగా ఇటీవల చెన్నూరులో స్వామి కంప్యూటర్స్ యజమాని కోడూరు రాజయ్యస్వామికి సంబంధించిన కారు, కొండపేటలో ఓ రైతుకు చెందిన తమలపాకు తోటకు కూడా ఎవరో ఆకతాయిలు అగ్గిపెట్టడంతో కాలిపోయాయి. ఇవి ఆకతాయిలు చేసిన పనా.. లేక ఇంకెవరైనా చేస్తున్నారా అని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 42వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 42వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ తనిఖీ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు, కొండాపురం సీఐ రఫీ, ముద్దనూరు సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటిని జల్లెడ పట్టారు. ప్రజలతో మాట్లాడారు. అలాగే పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా కొత్తవారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ సోదాల్లో సరైనా డాక్యుమెంట్లు లేని 41మోటార్ సైకిళ్లను, ఒక ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన రైతు రఘు (ఫైల్)

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మండలంలోని వెల్దుర్తి గ్రామానికి చెందిన మాతిగాళ్ల రఘు(45) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న 1.50ఎకరాల పొలంలో పంట సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ముగ్గురు కుమార్తెలకు వివాహం చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువై తీర్చే దారి తెలియక తనువు చాలించాడు. తోట వద్దకు వెళ్తున్నానని చెప్పి గంగమ్మ గుడి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎగువచెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండ్రోజుల్లో జరగనున్న బాల్యవివాహాన్ని సోమవారం అడ్డుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 100 ద్వారా రాబడిన సమాచారం మేరకు విచారణ చేయగా సదరు వధువు వివాహ వయస్సు పూర్తి కాలేదని తెలుసుకుని ఇరువైపుల పెద్దలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానం : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్నాయని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విరుచుకుపడ్డారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆడవాళ్లకు, మగవాళ్లకు, హిజ్రాలకు ఎవరికి రక్షణ లేదన్నారు. వేటకొడవళ్లు వీరవిహారం చేస్తున్నాయన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, జూదం, బెట్టింగ్‌లు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. నిన్న ఆదివారం పట్టపగలు కర్నూలు జిల్లా ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిప్పగిరి లక్ష్మీనారాయణను టిప్పర్‌తో ఢీకొట్టి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారు. ఏప్రిల్ 22న టీడీపీనేత వీరయ్యచౌదరిని ప్రత్యర్థులు చంపారని, మార్చి 11న ఒక ఎస్ఐని ఓ యువకుడు మద్యం మత్తులో జుట్టుపట్టుకొని లాగాడన్నారు. మద్యం మత్తులో తండ్రిని రంపంతో కోసి చంపాడొకడు, ఇంకొకడు భార్య, కూతురిని నరికి చంపాడన్నారు. ఇంకో చోట కళ్లలో కారం చల్లి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారు. ఇలా చెప్పుకొంటూపోతే కొండవీటి చాంతాడు అవుతుందని, నేర చరిత్ర గల ఎమ్మెల్యేలలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

కడప క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కడప నగర వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్‌లలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. లగేజీలను పరిశీలించారు. వైవీ స్ట్రీట్, బీకేయం స్ట్రీట్ వ్యాపార ప్రాంతాలు కావడంతో ఇక్కడ జనాల రాకపోకలు రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పోలీసులు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.


లగేజీని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

ఏకసంధాగ్రాహి..



● ఒకసారి వింటే చాలు..
● అనర్గళంగా ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను అప్పజెబుతున్న విద్యార్థి
● పేజీ నంబర్ చెబితే పాఠ్యాంశమంతా వివరణ ● చెస్‌లోనూ ప్రతిభ చూపుతున్న బాలుడు
● ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మట్టిలో మాణిక్యం.. వెంకటవినయ్

వేంపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ బాలుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సాధారణ విద్యార్థి. తల్లిదండ్రులూ చదువుకోలేదు. కూలినాలి చేసుకొని జీవించే కుటుంబం. కానీ ఆ విద్యార్థి ప్రతిభ తరగతికి మించి ఉంటుంది. సాధారణంగా తరగతిలోని పాఠ్యాంశాల్లో ప్రశ్నకు జవాబులు నేర్చుకుంటారు. కానీ ఆ పాఠ్యాంశాల్లోని ప్రతి అక్షరాన్ని మెదడులో ఉంచుకోలిగిన మేధస్సు ఈ బాలుడిలో ఉంది. పేజీ నెంబర్ చెబితే చాలు అందులో ఉన్న పాఠ్యాంశాన్ని చూడకుండా చెప్పగలిగే ప్రతిభావంతుడు. చదువుతో పాటు ఆటల్లోను తన ప్రతిభ చూపుతున్నాడు. చెస్‌లో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడిపైనే గెలిచే సత్తా సాధించాడు. ఇది వేంపల్లెలోని శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వలసగారి వెంకటవినయ్ ప్రతిభకు తార్కానం. పిట్ట కొంచెం.. కూత ఘనం నానుడికి చక్కగా సరిపోయే రూపం వెంకటవినయ్. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

వయస్సుకు మించిన ప్రతిభ

వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు, గంగాదేవి కుమారుడు వలసగారి వెంకటవినయ్. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తమ్ముడు జగదీష్ మూడో తరగతి చదువుతున్నాడు. తండ్రి బేల్దారి కూలి కాగా తల్లి ల్యాండ్రీ చేసి జీవించే కుటుంబం. వెంకటవినయ్ ప్రతిభను అక్కడ ఉపాధ్యాయుడిగా పనిచేసే రమేష్ గుర్తించారు. మొదట పాఠం చెప్పిన వెంటనే నేర్చుకొని అప్పజెప్పేవాడు. ఆ బాలుడిపై ప్రత్యేక దృష్టిసారించి మరింత లోతుగా బోధన చేయడంతో ఇంగ్లీష్‌లోని 8పాఠ్యాంశాలను, తెలుగులోని 10 పాఠ్యాంశాలను అనర్గళంగా చెప్పగలిగేంత స్థాయికి చేరుకున్నాడు. మిగతా విద్యార్థులందరు అందులోని ప్రశ్నలకు జవాబులు చెబుతుండగా, వెంటకవినయ్ తన వయసుకు మించి ప్రతిభ చూపుతున్నాడు. పుస్తకాల్లోని పేజీ నెంబర్ చెబితే చాలు.. అందులో ఉన్న పాఠ్యాంశాన్ని చూడకుండా చెప్పగలుగుతున్నాడు. ఇక చేతిరాతను అందంగా రాస్తున్నాడు. చదువుతో పాటు ఆటల్లో కూడా చురుగ్గా రాణిస్తున్నాడు. ప్రధానంగా చెస్‌లో అక్కడ పనిచేసే ఉపాధ్యాయులతో పోటీపడి గెలవగలిగే సత్తా తెచ్చుకున్నాడు.

పేదరికం అడ్డుకారాదు

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వలసగారి వెంకటవినయ్ ఎంతో ప్రతిభావంతుడుగా ఉన్నాడు. ఈ ప్రతిభ ఇలాగే కొనసాగాలంటే పైచదువులకు వెళ్లేసరికి ఆర్థికభారం పడుతుంది. అతని కుటుంబం పేద కుటుంబం కాబట్టి దాతలు ముందుకొచ్చి చదువుకునేందుకు చేయూతనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నది ఇక్కడి ఉపాధ్యాయుల ఆకాంక్ష. మట్టిలో మాణిక్యం లాంటి ఈ విద్యార్థికి మంచి భవిష్యత్తు అందాలని ఆకాంక్షిద్దాం.



కలెక్టర్ కావడమే లక్ష్యం..

నాపేరు వలసగారి వెంకటవినయ్. శ్రీరామ్‌నగర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాను. ఉపాధ్యాయుల సహకారంతో పాఠ్యాంశాల్లో ఎక్కడి నుంచైనా చెప్పగలను. భవిష్యత్తులో కలెక్టరై దేశానికి సేవ చేయడమే నా లక్ష్యం.

ప్రత్యేక దృష్టితో బోధన చేశాం..



చెప్పిన పాఠాలు చెప్పినట్లే వెంటనే అప్పజెప్పేవాడు. నాల్గో తరగతి వరకు ఇలా బోధన సాగింది. ఐదో తరగతిలో ప్రత్యేక దృష్టి సారించి విద్యాబుద్ధులు నేర్పించాం. తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలన్నీ చూడకుండా చెప్పగలుగుతున్నాడు. చెస్‌లోనూ రాణిస్తున్నాడు. ఈ విద్యార్థి చదువు ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

- రమేష్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శ్రీరామ్‌నగర్, వేంపల్లె

పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది

● టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాస్టర్ల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, తాను కూడా జిల్లాలోని పాస్టర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పాస్టర్లకు గౌరవవేతనం అందించినందుకు సోమవారం జమ్మలమడుగులో రాష్ట్ర క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు స్వామిదాసు, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం చర్చిలో థ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మంచి పాలన అందించే దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగా పేద వారికి పట్టణాల్లో ఆహారం సమస్య రాకుండా అన్నా క్యాంటిన్లు ఏర్పాటు చేశారని, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారన్నారు. పాస్టర్ల సమస్యలను క్రిస్టియన్‌సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పాస్టర్లకు గౌరవ వేతనం ఏడు నెలలకు రూ.35 వేలు అందించారని క్రిస్టియన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బిర్రు సంతోష్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి పొన్నతోట మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భావన టౌన్‌షిప్ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి


మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

● ఆర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భావన టౌన్‌షిప్ భూముల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇందులో ప్రభుత్వ భూమి ఉందని, దీని విలువ సుమారు రూ.200 కోట్లకు పైగా ఉంటుందని, వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని చెరపట్టిన నాటి సీకేదిన్నె తహసీల్దారు, ఎస్ఐ, వీరికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైసీసీ హయాంలో తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమాలు చేయించిన మాజీ ఎమ్మెల్యే రవిరెడ్డి, ఆయన అనుచరులైన గుమ్మా రాజేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మూలవంక, ఊటుకూరు రింగు రోడ్డు పరిసరప్రాంతాల్లో మరో 400కు పైగా ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, రానున్న రోజుల్లో వాటిపై కూడా పూర్తి ఆధారాలతో మరో సుదీర్ఘ పోరాటానికి ఆర్‌సీపీ సన్నద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, నగర కార్యదర్శి మగ్బూల్‌బాషా, కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రసాద్, సుబ్బరాయుడు, రమేశ్ పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలను జూన్‌లో పూర్తి చేయాలి

కలికిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2019-20 సంవత్సరంలో మంజూరై ఇప్పటికీ నిర్మాణాలు పూర్తి కాకుండా వున్న ఇళ్లను జూన్‌లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో భానుమూర్తి రావు తెలిపారు. వివిధ స్థాయిల్లో వున్న ఇలాంటి 176 ఇళ్లను గుర్తించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మొత్తం లబ్ధిదారుల్లో ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేల వంతున వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మే 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి అన్ని ఇళ్లను జూన్ ఆఖరుకు పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత గడువులోగా ఇళ్లను పూర్తి చేయాలని ఎంపీడీవో కోరారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం బాబుకాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు నాగరాజ(35) మూడు నెలల క్రితం భార్య తనపై అలిగి పుట్టింటికి వెళ్లింది. ఎన్ని పర్యాయాలు పిలిచిన కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పహల్గాం దాడికి న్యాయవాదుల నిరసన

వాల్మీకిపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా సోమవారం వాల్మీకిపురం జూనియర్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందకుమార్, సెక్రటరీ రమణ, న్యాయ వాదులు పీజీ విభాకర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాక్ ఉగ్రవాదులను తరిమికొట్టాలి..

నిమ్మనపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాదులను తరిమికొట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం దిగువపల్లిలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

పకడ్బందీగా పాలీసెట్

● ఏర్పాట్లు పూర్తి ● పాలీసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జ్యోతి


విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలీసెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పాలీసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. సోమవారం నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న పాలీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇందేరే సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకే పరీక్షకేంద్రం వద్ద ఉండాలన్నారు. కడపతో పాటు ప్రొద్దుటూరు ప్రాంతంలో ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ అయ్యాయని, హాల్‌టికెట్ అందనివారు 29వ తేదీ మధ్యాహ్నంలోగా తమ కళాశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కోఆర్డినేటర్ దామోదరం పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్‌ఎం



కడప మారుతీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో తరిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల వల్ల కానీ, సంబంధిత ఉద్యోగుల వల్ల కానీ ఏదైనా సమస్యలుంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఈనెల 30వ తేదీన డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4.30 నుండి 5.30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సమస్యలపై సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికు లు 9959225848 నెంబరుకు ఫోన్ చేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభమైన వైవీయూ డిగ్రీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 55 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 25892 మంది విద్యార్థులు సోమవారం బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీకాం, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు ప్రారంభమయ్యాయి. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు తనిఖీ చేసి హాల్‌టికెట్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ఈ పరీక్షలు మే 24వ తేదీ వరకు ఉంటాయని, ప్రతి పరీక్ష కేంద్రానికి అబ్జర్వర్లను నియమించాలని, అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయన్నారు.

ఇరువురు బాలుర మిస్సింగ్


మిస్సింగ్ అయిన దర్శన్, లక్ష్మణ్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఇద్దరు బాలురు ఆదివారం రాత్రి నుంచి కనుబడటం లేదని వారి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంబటూరు వెంకట దర్శన్ (16) గవర్నమెంట్ బాయిస్ హైస్కూల్లో పదో వతరగతి చదివాడు. ఇటీవలె వచ్చిన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. ఆదివారం ఉదయం ఇంట్లో వున్న రూ.500 కనపడకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో దర్శన్ తన చిన్నాన్న ఇంటికి వెళ్లి చిన్నాన్న కొడుకు లక్ష్మణ్ (11) తో కలిసి వెళ్లిపోయాడని తెలిపారు. ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో వెతకడం ప్రారంభించామని, ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సంపన్నుల కక్కుర్తి..!

- మురుగు కాలువలు ఆక్రమించి గార్డెన్.. పక్కనే పార్కింగ్
- ఎదురుగా వాహనం వస్తే వెనక్కే.
- రెడ్డెప్పనాయుడు కాలనీలో ప్రజల అవస్థలు



రెడ్డెప్పనాయుడు కాలనీ ప్రధాన ప్రవేశ ద్వారం

మదనపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అది సంపన్నులు నివసించే కాలనీ. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యావంతులు, మేధావులు అత్యధికంగా ఉన్న ఏరియా. మదనపల్లె-తిరుపతి ప్రధాన రహదారి పక్కన, ఆర్టీసీ బస్టాండుకు అతిసమీపంలోని రెడ్డెప్పనాయుడు కాలనీ. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించిన మొదట్లో చైర్మన్‌గా ఉన్న రాటకొండ రెడ్డెప్ప నాయుడు పేరు మీద ఏర్పడింది. ఈ కాలనీ సంక్షేమానికి ఓ అసోసియేషన్ కూడా ఉంది. ప్రశాంత వాతావరణంతోపాటు వాహనాల రణగొణ ధ్వనులు లేని ప్రాంతం కావడంతో ఆసుపత్రులతోపాటు విద్యాలయాలు కూడా ఉన్నాయి. మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న అధికారిక లేఅవుట్‌లలోని నాలుగింటిలో రెడ్డెప్ప నాయుడు కాలనీ కూడా ఒకటి. సంపన్నులు, ఉన్నతమైన కుటుంబాలున్న ఈ ప్రాంతంలో రోజురోజుకూ రోడ్ల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. ఆర్టీసీ బస్టాండు ఏరియా నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనుంచి ఈ కాలనీలోకి వెళ్లేందుకు ఉన్న రెండు రహదారు లకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని చిరువ్యాపారులు ఆక్రమించేశారు. ప్రధాన కాలనీలోకి వెళ్లే, విశాల మైన రోడ్లు, లింకురోడ్లు సైతం ఆక్రమణబారిన పడ్డాయి. మూడు దశాబ్దాల క్రితం 40 అడుగుల రోడ్లతో ఈ లేఅవుట్ ఏర్పాటు చేశారు. సామాజిక అవసరాల నిమిత్తం అర ఎకరా స్థలం మున్సిపాలిటీకి కేటాయించడంతో పాటు రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కాలనీలో ప్రధాన రహదారులతోపాటు లింకు రోడ్లు, క్రాస్‌లుకలిపి మొత్తం 20 వీధులు ఉన్నాయి.



రోడ్డుకు ఇరువైపులా గార్డెన్, వాహనాల పార్కింగ్



ఇరుకుగా మారిన వీధి

20 అడుగులకు మించి దారి లేదు.

ఈ వీధుల్లో ఎదురెదురుగా వాహనాలు వస్తే.. వాటిలో ఏదో ఒకటి వెనక్కు వెళ్లాల్సిందే. ఈ కాలనీలోని రోడ్లే కాదు.. మురుగు కాలువలనూ వదలలేదు. కాలువలపై గార్డెన్, పక్కనే షెడ్లు, కారు పార్కింగ్. వాటికి ఇనుప కమ్మీ, రాడ్లతో ఫెన్సింగ్ కూడా ఒకరిని చూసి ఒకరు రోడ్లను కబ్జా చేసి ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ కుంట స్థలం రూ.70 లక్షలకుపైనే వుంది. ఒక కుంట స్థలంలో ఇల్లు నిర్మించాలంటే కనీసం రూ.కోటి ఖర్చు చేస్తున్నారు. స్థలం మొత్తం భవనం నిర్మించి ప్రవేశ ద్వారం ముందు మెట్లను డ్రైనేజీ పై నిర్మించిన ఘనులు కూడా ఉన్నారు. ఇళ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న సంపన్నులు ప్రభుత్వ స్థలం విషయంలో కక్కుర్తి పడుతున్నారు. అయినా, అటు మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక వాహనంలో వెళ్తే, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో వారు ప్రత్యక్షంగా చూడొచ్చు. ఈ క్రమంలో కొందరు పెద్దలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి యథావిధిగా రోడ్డు విస్తరణ చేయాలని కోరినా ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిరక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్

పీలేరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి); ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే చర్యలు తప్పవని పీలేరు ఎంపీడీవో శివశంకర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ఫిర్యాధుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినీటి పథకాలు, చేతి పంపులు పనితీరుపై పర్యవేక్షణ తప్పనిసరన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి రక్షిత మంచినీటి పథకాలను బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలని ఆదేశించారు. పంచాయతీలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోవులకు పశుగ్రాసం వితరణ

తంబళ్లపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండ ఆలయంలోని గోవులకు రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర ట్రాక్టరు లోడు వరిగడ్డిని అందచేశారు. కొన్ని రోజుల కిందట మల్లయ్యకొండ అడవి కాలిపోవడంతో పశువులకు మేత లేకుండా పోయింది. కాగా, పది రోజుల కిందట ఆయన మల్లయ్యకొండ ఆలయానికి ఆవు, దూడలను దానం చేశారు. ఈ సందర్భంగా కొండపైన గ్రాసం లేదని గమనించాడు. దీంతో సోమవారం రూ.10 వేలు విలువ చేసే వరిగడ్డిని అందజేశాడు.

అక్రమ వసూళ్లపై విచారణ చేయించండి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల పీఎఫ్ సమస్యలను పరిష్కారం చేస్తామంటూ యూనియన్ల పేరుతో అక్రమ వసూళ్లు చేస్తున్న వారిపై సమగ్ర విచారణ చేయించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చైర్మన్ మనూజకు వేరువేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లోకి మార్చడంతో పీఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం, విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోవడంలాంటి సమస్యలు తలెత్తాయన్నారు. ఈ నేపథ్యంలో యూనియన్ నాయకులమని చెప్పుకుని కొందరు కార్మికుల నుంచి వేలకు వేలు డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రాజే శ్వరి, ప్రభాకర్‌రెడ్డి, అంగన్వాడీల నాయకులు మధురవాణి, ఆటో యూనియన్ నాయ కులు నాగరాజ, ఐటీయూసీ కన్వీనర్ కృష్ణమూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చలపతి నాయుడు, రామకృష్ణ, గోపాల్ కృష్ణమూర్తి, అరవింద్, సంగీత, ఈశ్వరమ్మ, తులసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో రేపు ఉద్యోగ మేళా

పీలేరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి); ఈ నెల 30న పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఉపాధి అధికారి ఏ. సురేష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పీలేరు పరిసర ప్రాంతాలలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30న ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా కొనసాగుతుందని చెప్పారు. టాటా క్యాపిటల్, డైకిన్, ఫాక్స్‌కాన్, విస్ట్రోన్, హీరో మోటో క్రాప్, ముత్తూట్ ఫైనాన్స్, తదితర కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. వివిధ హోదాలలో పనిచేయుటకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, చదివిన వారు అర్హులని తెలిపారు. 18 నుంచి 34 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 12 వేల నుంచి రూ. 30 వేల వరకూ హోదాను బట్టి జీతం పొందవచ్చునని చెప్పారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటోలు తీసుకురావాలని కోరారు.

వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కురబలకోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టు గ్రామంలో సోమవారం సంతాన వేణుగోపాల స్వామి రథోత్సవం, ఆదివారం రాత్రి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. తెట్టు మాజీ సర్పంచ్ కామకోటి ప్రసాదరావు అన్నదానం చేశారు. సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి, పి.సురేంద్ర యాదవ్, అయూబ్ బాషా, బాలకృష్ణ, , రామ చంద్ర, వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, బొగ్గు భాస్కర్, సదాశివ, సూరి, చంద్ర, వెంకటరమణా రెడ్డి, శ్రీనివాసులు, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎస్సీ, ఎస్టీ కులాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచు ఎ.రెడ్డి రాము ఇంట్లో జరిగిన కార్యక్రమానికి సోమ వారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఇటీవలే వివాహమైన రెడ్డి రాము కుమార్తె కావ్యశ్రీ, అదే గ్రామానికి చెందిన 108 పైలట్ వెంకటస్వామి కుమారుడు మంజునాథ్‌లను ఆశీర్వదించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో సర్పంచు రెడ్డిరాము, 108 పైలట్ వెంకటస్వామి దంపతులతో పాటు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, నాయకులు చిన్న రెడ్డెయ్య, వెంకటపతి, ఆనంద రెడ్డి, కేవీ రెడ్డి, సహదేవ రెడ్డి, భద్రయ్య, చల్లయ్య శ్రీనివాసులు, శంకరయ్య, వెంకట్రమణ, గంగాధర్, రఘు, వెంకటస్వామి, మున్వర్ ఆలీ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని విద్యార్థులు ఉయోగించుకోవాలని మద నపల్లె ఎంఈవో రాజగోపాల్ కోరారు. సోమవారం ఆయన ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లిష్, మానవతా విలువలు, యోగ, చిత్ర లేఖనంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకో కుండా తల్లిదండ్రులు శిక్షణకు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మదనపల్లెలోని జిల్లా గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, డాక్టర్ తిరుపతి రావు, రెడ్డెప్ప, రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

గోడపై నుంచి పడి ఒకరి మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇంటి గోడపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మొలకలచెరువు మండలం, బిక్షలవారిపల్లెకు చెందిన గోవిందరెడ్డి (65) నిర్మాణంలో ఉన్న గోడపై ఎక్కి నీళ్లు పడుతూ, కాలుజారి కిందపడ్డాడు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

రీసర్వే డీటీగా కమలాకర్

గుర్రంకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డీటీగా కమలాకర్ సోమవారం బాధ్యతలను స్వీకరిం చారు. గతంలో ఆయన కలకడ ఆర్ఐగా పని చేసేవారు. సర్వేలో తప్పులకు చోటులేకుండా చూస్తామన్నారు. రైతులు రీసర్వే తప్పిదాలపై ఆం దోళన పడకుండా పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు ములకలచెరువు మండల సమావేశం

ములకలచెరువు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ సాయిలీల అధ్యక్షతన మంగళవారం ములకల చెరువు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరినారాయణ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రేపు ఎగువపల్లిలో సివిల్ రైట్స్ డే

నిమ్మనపల్లి ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం పంచాయతీ ఎగువపల్లిలో బుధవారం పౌరహక్కుల పరిరక్షణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అమరనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 30న క్రమం తప్పకుండా మండలంలోని ఒక గ్రామంలో పౌరహక్కుల పరిరక్షణకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 30న ఉదయం 11:00 గంటలకు ఎగువపల్లిలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజలు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం

వాల్మీకిపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని వాల్మీకిపురం జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 41 రోజులుగా నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థుల నైపుణ్యం పెంపు , వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయను న్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి పసుపులేటి రమాపతి, ఉపాధ్యాయులు కృష్ణప్ప, సచివాలయ అధికారి రెడ్డిసుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

1 నుంచి బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరం

వాల్మీకిపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మే 1 నుంచి బాస్కెట్ బాల్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూఉదయం 6 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణలో పాల్గొనే క్రీడాకారులకు ప్రతి రోజూ ఉదయం సాయంత్రం పౌష్టికాహారం అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రవిచంద్ర, క్రీడాకారులు సుబ్ర హ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ గోడ కూలి ముగ్గురికి గాయాలు

- పరిశీలించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



కూలిన పాఠశాల ప్రహరీగోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం త్యాగరాజు వీధిలోని కోటబడి మున్సిపల్ హైస్కూల్ ప్రహరీ గోడ కూలడంతో సోమవారం వేదాంత్, చారుకేశ్, హేమవరుణ్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కూలిపోయిన గోడను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ గోడను 30 ఏళ్ల కిందట నిర్మించారని, ఈ గోడ బలహీనమై ఒక్కసారిగా కూలిపోయిందన్నారు. ఆ సమయంలో ముగ్గురు విద్యార్థులు అక్కడ ఉండగా ఓ విద్యార్థి తలకు నాలుగు కుట్లు పడ్డాయన్నారు. ఈ విద్యార్థి వైద్యఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కూలిన ప్రహరిగోడ స్థానంలో కొత్త గోడ నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఇలాంటి పాతగోడలు ఏవైనా ఉంటే గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తులసీ, రామకృష్ణాచారి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లె చెరువు కట్టకు మరమ్మతులు చేయించండి



ప్రజల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తపల్లె చెరువు కట్టకు మరమ్మతు లు చేయించాలని గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యం లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని చెరువు కట్టను కృష్ణమూర్తి అనే వ్యక్తి ఆక్రమించి నేలమట్టం చేశాడని, దీనిపై ఫిర్యాదు చేస్తే మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చాడన్నారు.ప్రస్తుతం మీ వల్ల అయ్యింది చేసుకోమంటున్నాడని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై విచారించి చెరువుకట్టకు మరమ్మతులు చేయించాలని కోరారు. మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద ఆర్‌వోబీ కోసం భూమి సేకరిస్తున్న అధికారులు, నష్ట పరిహారం మాత్రం వేరొకరికి చెల్లించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని బాధితులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు భూ సమస్యలు, సర్వే సమస్య లు, ప్రైవేటు వివాదాల విషయమై పలువురు సబ్ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. వీటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు



రిలే దీక్షల్లో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి); న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో జాప్యం దగదని అన్నమయ్య జిల్లా ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి పీ.ఎస్.ఎం. రాజు అన్నారు. సోమవారం పీలేరు ఆర్టీసీ డీఎం కార్యాలయం వద్ద రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీ.ఆర్.డీ నాయక్ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం అధి కారుల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ధర్నా చేయాల్సి వస్తోందన్నారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 2019ని అమలు చేయాలని, అక్రమంగా కార్మికులపై కేసులు పెట్టడం మానుకోవాలని కోరారు. లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ సత్వరం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ అలవెన్స్ రూ. 150 నుంచి రూ.400కు పెంచాలని కోరారు. ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ లేదా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గ్యారేజ్ కార్మికుల సమస్య లు సత్వరం పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. ప్లకార్డులు ప్రదర్శించారు. దీక్షలో ఏ. ఆర్. చంద్ర, బీ. ఆనంద, కే. రఘు, బీ.ఎస్. శంకర్, వీ.ఎస్. జయంతి, డీ. సుభాషిణి, ఎం.ఏ. రాధ, పీ.ఎస్. రాములు, వీ.పీ. కుమార్, ఎం. రవి, ఆర్. ఈశ్వరయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిపో అధ్యక్షుడు పీ.వీ. రమణ, కార్యదర్శి ఆదినారాయణ, జోనల్, జిల్లా, డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ఆటో

తంబళ్లపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం తంబళ్లపల్లెలో చోటు చేసుకుంది. గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు చెందిన 10 మంది భక్తులు సోమవారం తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ఆటోలో వచ్చారు. స్వామి వారి దర్శనం చేసుకుని కొండ పైనుంచి దిగుతుండగా కింద నుంచి ఐదో మలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు(40) తీవ్రంగా గాయపడగా, మరో బాలుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆటో ముందు అద్దం, టాప్ పూర్తిగా దెబ్బతినింది. అదే దారిన వెళ్తున్న భక్తులు ప్రమాదాన్ని గుర్తించి బాధితుల్ని తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్సలు అందించారు.

మల్లయ్యకొండలో భక్తుల రద్దీ



ఆలయంలో బారులు తీరిన భక్తులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ ఆలయం సోమవారం కిటకిట లాడింది. తెల్లవారు జాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకుడు ఈశ్వరప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల పేరిట అర్చనలు, పంచామృ తాభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా గౌరమ్మ ఆలయంలో, ఏనుగు మల్లమ్మ ఆలయాల్లో అమ్మ వారికిపూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈవో మునిరాజ, టీడీపీ నాయకుడు ఉత్తమ్ రెడ్డిలు కొండ పైన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఆధార్ కష్టాలు తీరేదెన్నడో..?

- చంటిబిడ్డలతో మహిళల పడిగాపులు
- అదనపు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



ఆధార్ కేంద్రంలో చిన్నారులతో పడిగాపులు కాస్తున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదు కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలన్నా, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నా, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేయాలన్నా, ఆధార్ కార్డు తప్పనిసరిగా జత చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడో నమోదు చేసిన వివరాల్లో పలు తప్పులు చోటు చేసుకున్నాయి. ఇలాంటి తప్పులను సరిదిద్ది మార్పులు, చేర్పులతో సరికొత్త ఆధార్ కార్డులను పొందడానికి ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆధార్ సెంటర్లలో త్వరితగతిన పనులు జరగడం లేదని, దీంతో రోజుల తరబడి ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పీటీఎంలోని ఆధార్ సెంటర్ వద్ద చంటి పిల్లలతో తల్లులు వేచి ఉండడం కన్పించింది. వారిని ప్రశ్నించగా భగభగ మండుతున్న ఎండలతో ఇబ్బంది పడుతూ చంటిబిడ్డలతో ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ సెంటర్లో పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని, లేదా అదనపు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఒక్క పీటీఎం మండలంలోనే కాకుండా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆధార్ కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి నెలకొందని అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.